
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 14 జూన్ 2025 | 5





కాకినాడలో జాబితా తనిఖీ

అమ్మలకు.. ఆనందం!



చంద్రన్నకు తల్లుల వందనాలు

(రాజమహేంద్రవరం/అమలాపురం/కాకినాడ- ఆంధ్రజ్యోతి)

చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు.. అమ్మల కళ్లల్లో ఆనందం చూశారు. 'తల్లికి వందనం' డబ్బులు తల్లుల ఖాతాల్లో జమ కావడం శుక్రవారం నుంచి ఆరంభమైంది. గురువారం జమ అవుతాయని చెప్పినా అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం రూపంలో అనుకోని విపత్తు సంభవించడంతో ఒకరోజు ఆలస్యమైంది. చంద్రబాబు చెప్పిన విధంగానే ఎందరు పిల్లలు (విద్యార్థులు) అంతమందికీ ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఒకటో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి ఏడాది అడ్మిషన్లు జరుగుతున్న కారణంగా వారికి తర్వాత ఇస్తారు. ఇప్పుడు రెండో తరగతి నుంచి పది, ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు సంబంధించి వారి తల్లుల ఖాతాల్లో ఒక్కొక్కరికీ రూ.13 వేలు చొప్పున జమవుతున్నాయి. రూ.2 వేలను పాఠశాల నిర్వహణ నిమిత్తం మినహాయిస్తున్నారు. ఇద్దరు పిల్లలుంటే రూ.26 వేలు.. ముగ్గురు పిల్లలుంటే రూ.39 వేలు ఖాతాల్లో జమ చేశారు. ఆ మెసేజ్‌సెల్‌కి రావడంతోనే కుటుంబం ఎగిరి గంతేసినంత పనిచేస్తోంది.

5.80 లక్షల మంది విద్యార్థులు

ఉమ్మడి తూర్పుగోదావరిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో సుమారు 5.80 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం దాదాపు రూ.800 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) విధానం కావడంతో ఒకేసారి అంత మొత్తాన్ని ఆయా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తే సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతాయి. సర్వర్లు మొరాయిస్తాయి. అందువల్ల అర్హులైన ప్రతి ఒక్కరి ఖాతాల్లో గంటల తేడాతో సొమ్ము జమవుతోంది. ఈ ప్రక్రియ వచ్చే నెల 5 వరకూ కొనసాగనుంది. తూర్పు గోదావరి జిల్లాలో 1,88,226 మంది విద్యార్థులకు సంబంధించి 1,23,779 మంది తల్లుల ఖాతాల్లో సుమారు రూ.240 కోట్లు, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1,70869 మంది పిల్లలకు సంబంధించి 1,12,419 మంది తల్లుల ఖాతాల్లో రూ.250 కోట్లు, కాకినాడ జిల్లాలో 2,28,780 మంది విద్యార్థులకు సంబంధించి 1,49,400 మంది తల్లుల ఖాతాల్లో రూ.340 కోట్లు జమ కానున్నాయి.

సచివాలయాల వద్ద క్యూ

సచివాలయాల వద్దకు ప్రజలు పదుల సంఖ్యలో చేరుకుని అర్హత జాబితాలను పరిశీలించుకునే పనిలో బిజీబిజీగా ఉన్నారు. కొందరు అనర్హుల జాబితాలో ఉండడంతో కారణాల అన్వేషణలో పడ్డారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అత్యధికులు విద్యుత్ బిల్లుల షాక్ వల్ల అనర్హుల జాబితాలోకి వెళ్లిపోయారు. ఏడాదిని యావరేజ్ చేసి విద్యుత్ బిల్లులు నిర్ధారించడంతో ఈసారి ఎక్కువ మంది లబ్ధిదారులు అర్హత సాధించకుండాపోయారు. పి.గన్నవరం మండలం లంకలగన్నవరం గ్రామానికి చెందిన 178 మందికి విద్యుత్ బిల్లుల షాక్ కారణంగా అనర్హులుగా పరిగణించబడ్డారు. వీరంతా గన్నవరంలోని విద్యుత్‌శాఖ కార్యాలయానికి వచ్చి ఏడాదిని యావరేజ్ చేయించుకుని విద్యుత్‌శాఖ నుంచి సర్టిఫికెట్లు తీసుకునే పనిలో నిమగ్నమయ్యారు. మరో వైపు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలకు కొందరు చేరుకుని తమ పేరున నాలుగు చక్రాల వాహనాలు ఉండడం వల్ల అనర్హత జాబితాలో ఉన్నామని.. తమకు ఏమీ లేవని క్లియరెన్స్ సర్టిఫికెట్లు కావాలంటూ కార్యాలయాల చుట్టూ తిరగడం ప్రారంభించారు. ఒక చోట మ్యాపింగ్ పూర్తయిన తర్వాత మరో చోటకు ఇల్లు మారిన వారు అయోమయానికి గురవుతున్నారు. తాము ప్రస్తుతం నివాసం ఉంటున్న పరిధిలోని సచివాలయంలో పిల్లల పేర్లు లేకపోవడం, ఎక్కడ జాబితాలో ఉన్నాయో తెలియకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. సచివాలయాల్లో జాబితాలు ప్రదర్శించారన్న సమాచారం ఇప్పుడిప్పుడే గ్రామాల్లో ప్రజలకు చేరుతుంది. రెండో శనివారం సెలవు, ఆదివారం సెలవు దినాలు కావడంతో లబ్ధిదారులు మళ్లీ సోమవారం వరకు తమ భవిష్యత్తును పరీక్షించుకునేందుకు రెండు రోజులపాటు వేచి చూడాల్సిందే. నిధులు పొందిన వారిలో ఆనందం కనిపిస్తుంటే, అనర్హుల్లో మాత్రం ఆవేదన వ్యక్తమవుతోంది.



తల్లికి వందనం నగదు జమ సందర్భంగా కాకినాడ పెగోడా స్కూల్‌లో సీఎం చిత్రపటానికి పాలభిషేకం

- మాట నెరవేర్చిన ప్రభుత్వం
- తల్లుల ఖాతాల్లో నగదు జమ
- ఉదయం నుంచి ఫోన్లకు మెసేజ్‌లు
- సచివాలయాల్లో అర్హుల జాబితా
- ఎగిరి గంతేసిన అర్హులు
- 20 వరకు అభ్యంతరాలు స్వీకరణ
- 28న మరొక జాబితా ప్రదర్శన
- 30న ఒకటి, ఇంటర్ విద్యార్థులకు

నగదు జమకాకపోయినా కంగారుపడొద్దు!

సచివాలయాల్లో శుక్రవారం నుంచి అర్హులు, అనర్హుల జాబితా ఉంచారు. అభ్యంతరాలు, వినతులు ఈనెల 20వ తేదీలోపుగా ఆయా సచివాలయాల ద్వారా సమర్పించాలి. మరొక అర్హుల జాబితా 28వ తేదీలోపుగా రూపొందిస్తారు. ఒకటో తరగతి, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు సంబంధించి ఈనెల 30న జాబితాలు ప్రదర్శిస్తారు. మొత్తం తల్లికి వందనం నగదు జమ ప్రక్రియ వచ్చే నెల 5వ తేదీతో పూర్తి చేస్తారు. అర్హుల జాబితాలో ఉంటే సొమ్ము ఖచ్చితంగా జమవుతుందని అధికారులు చెబుతున్నారు. అనర్హత జాబితాలో ఉన్నవారు నిరాశకు గురైనా గ్రీవెన్స్‌కి సమయం ఉందని సూచిస్తున్నారు. ఇప్పుడు ప్రకటించినది మొదటి లిస్టు.. సమస్యల పరిష్కారం తర్వాత రెండో లిస్టు ప్రకటిస్తారని చెబుతున్నారు. ఆధార్ తదితర సమస్యలు ఉంటే సరిచేసుకోవాలంటూ ఇప్పటికే ఆయా పాఠశాలలకు జాబితాలు వెళ్లాయి. దీంతో పాఠశాలల సిబ్బంది తల్లులకు సమాచారం ఇస్తున్నారు. ప్రతి తల్లి లేదా సంరక్షకుడు ఆధార్ సీడింగ్ పూర్తి చేసుకున్న బ్యాంకు ఖాతాకే డబ్బులు జమవుతాయి. సింగిల్ పేరెంట్ తండ్రి ఉంటే అతని ఖాతాకు డబ్బులు వెళతాయి.అనాథ పిల్లల నగదును కలెక్టర్ల ఖాతాల్లో జమ చేసి పరిశీలన అనంతరం అందజేస్తారు. ఇప్పటికే అర్హులకు సంబంధించిన నగదును బ్యాంకులకు ప్రభుత్వం పంపించింది.



నలుగురికి రూ.52 వేలు..

మాది పెరవలి మండలం కానూరు అగ్రహారం.. మా నలుగురు పిల్లలు.. రూ.52 వేలు మా అకౌంట్‌లో పడ్డాయి. ఒకేసారి ఇంత పెద్ద మొత్తం మా అకౌంట్‌లో పడడం తొలిసారి. చాలా ఆనందంగా ఉంది. గతంలో కేవలం ఒక్కరికి మాత్రమే వచ్చేవి. సీఎం చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు.

- మిండాల శివయ్య, ధనలక్ష్మి, కానూరు



ఆధార్ లింకైతే నలుగురికి...

మాకు నలుగురు పిల్లలు. సాకుర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. గతంలో అమలాపురంలో ఉండేవాళ్లం. రేషన్‌కార్డు అక్కడే ఉంది.బ్యాంకుఖాతాకు ఆధార్ అనుసంధానం కాలేదు.దీంతో నిలిచిపోయింది. అనుసంధానమైతే తల్లికి వందనం వస్తుందని విద్యాశాఖాధికారులు తెలిపారు.

- జి.శ్రీనివాసరావు,శాంతికుమారి, సాకుర్రు



అమ్మ లేకున్నా.. నానమ్మకు..

తల్లి లేని ముగ్గురు పిల్లలకు రూ.39 వేలు జమైంది. ఆనందంగా ఉంది. మా అబ్బాయి దిమ్మిలి దేవదాసు వ్యవసాయ కూలీ. కొంత కాలం కిందట అతని భార్య చనిపోయింది. దీంతో ముగ్గురు పిల్లల సంరక్షణ నేనే చూస్తున్నా.ఇచ్చిన మాటకు కట్టుబడి సొమ్ములు వేసిన కూటమి ప్రభుత్వానికి ఇదే మా వందనం.

- నాయనమ్మ సుబ్బలక్ష్మి, చిన్నారులు

మా పిల్లల చదువుకు వినియోగిస్తాం..



నా ముగ్గురు పిల్లలకు రూ.39 వేలు జమయ్యాయి. ఆనందంగా ఉంది. మాది బిక్కవోలు మండలం రంగాపురం..శుక్రవారం ఉదయం మెసేజ్ వచ్చింది.. ఏమిటా అని చూస్తే రూ.39 వేలు జమయ్యాయి. సొమ్ము బ్యాంకులోనే ఉంచి మా పిల్లల చదువుకు వినియోగిస్తాం.

- తనుబోయిన అనూష, వెంకటరమణ, బిక్కవోలు

ముగ్గురికి రూ.39 వేలు పడ్డాయి..



చంద్రబాబు చెబితే చేస్తారని తెలుసు.. బాబును నమ్మాం.. బాగుపడుతున్నాం.. మాది కడియం మండలం దుళ్ళ.. నా పేరు తొట్టా స్వాతి. నా భర్త సత్తిబాబు ఆటో డ్రైవరు.. మాకు ముగ్గురు అమ్మాయిలు...నా ఖాతాలో రూ.39 వేలు జమయ్యాయి. చాలా సంతోషంగా ఉంది.

- తొట్టా స్వాతి, సత్తిబాబు, దుళ్ళ

అన్నమాట నిలబెట్టుకున్నారు...



పాఠశాలల ప్రారంభం మరుసటి రోజునే తల్లికి వందనం వేయడం ఆనందంగా ఉంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని, అన్నమాట నిలబెట్టుకున్నారు. మా ముగ్గురు కుమార్తెలకు రూ.39 వేలు పడ్డాయి.

- ఎస్.శ్రీనివాసరావు, త్రిలోకసుందరి, గంగలకుర్రు (పెదపాలెం)

చంద్రన్నకు వందనం



మాకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక అబ్బాయి.. శుక్రవారం ముగ్గురికి అమ్మకు వందనం సొమ్ము జమైంది. దీంతో మా కుటుంబం ఎంతో ఆనందంగా ఉంది. గత ప్రభుత్వంలో మణికంఠకు మాత్రమే ఇచ్చారు.

- ఉప్పు నాగరాజు,నాగమహాలక్ష్మి, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం

రూ.39 వేలు..చదువులకే ఖర్చు చేస్తాం..



మాకు ముగ్గురు పిల్లలు. ముగ్గురు బంగారు తల్లులే. శుక్రవారం రూ.39 వేలు పడ్డాయి. ఎంతో ఆనందం కలిగింది. గతంలో ఒకరికే పడేది.. ఇప్పుడు ముగురికి డబ్బులు పడ్డాయి. వారి చదువుకే ఖర్చు చేస్తా.

- త్రినాథుల శివశంకర్, మల్లిక దంపతులు, దుర్గాడ

ఇది మంచి ప్రభుత్వం



మాది కాకినాడ జగన్నాథపురం. మాకు ఇద్దరు అమ్మాయిలు. రౌతు అవంతిక, రౌతు నక్షత్ర. కాకినాడ గొడారిగుంటలో చదువుతున్నారు. మా ఇద్దరు పిల్లలకు ఇచ్చారు. ఇది మంచి ప్రభుత్వం. చాలా సంతోషంగా ఉంది. చంద్రబాబు హామీ ఇచ్చారు.. నెరవేర్చారు.

- రౌతు సంధ్యాకుమారి, జగన్నాథపురం, కాకినాడ

ఎస్సీ విద్యార్థులకు జమకాలేదు..

రాజమహేంద్రవరం అర్బన్/ కాకినాడ కార్పొరేషన్, జూన్13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్న అర్హులైన ఎస్సీ విద్యార్థినీ.. విద్యార్థులకు తల్లికి వందన పథకంలో డబ్బులు వారి బ్యాంకు అకౌంట్‌కు జమ కాలేదని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఎంఎస్ శోభారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలో 2,660 మంది, కాకినాడ జిల్లాలో 2367 మందికి సొమ్ములు జమ కాలేదని పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 8, 9 తరగతులు చదువుతున్న ఎస్సీ విద్యార్థులు 557 మంది తల్లుల అకౌంట్‌కు ఇంకా డబ్బులు జమ కాలేదన్నారు. అదే విధంగా కాకినాడ జిల్లాలో 9,10 తరగతి చదువుతున్న విద్యార్థులు 500 మందికి వారి తల్లుల ఖాతాల్లో జమ కావాల్సి ఉందన్నారు. తల్లికి వందనం డబ్బులు జమకాని తల్లిదండ్రులు కంగారుపడాల్సిన అవసరం లేదన్నారు. వెంటనే దగ్గరలో ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల్లో సంప్రదించాలన్నారు. ముందుగా సమస్య ఏమిటనేది తెలుసుకోవాలన్నారు. అనంతరం సమస్య పరిష్కారానికి చర్యలు చేపడితే రెండో విడతలో వస్తుందన్నారు.అర్హుల జాబితాలో ఉండి సొమ్ములు పడకపోయినా ఇబ్బందిలేదన్నారు.



నేడు సచివాలయాల్లో ప్రత్యేక మేళా

సచివాలయాల్లో శనివారం ఉదయం 11 గంటలకు మేళా నిర్వహిస్తున్నారు. సచివాలయం వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్/వార్డు ఎడ్యుకేషనల్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీని సంప్రదించాలి. అర్హుల జాబితాలో ఉన్నా సొమ్ము పడక పోవడానికి ప్రధాన కారణం.. నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)లో ఆధార్‌ను అనుసంధానం చేసుకోకపోవడమే.బ్యాంకు అకౌంట్ ఉన్న వారు ఎన్‌పీసీఐకి ఆధార్ అనుసంధానం చేసుకుంటే ప్రభుత్వ పథకాలకు సం బంధించిన సొమ్ములు జమవుతాయి.అయితే కాస్త సమయం పడుతుందని సమాచారం. తల్లికి వందనం పథకంలో ఆర్థిక సహాయం పొందడానికి పోస్టాఫీసులో ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు (ఐపీపీబీ)లో అకౌంట్ ఓపెన్ చేసుకుంటే నగదు జమవుతుందని చెబుతున్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు పోస్టాఫీసులో అకౌంట్ ఓపెన్ చేసుకోవడంతోపాటు ఎన్‌పీసీఐలో ఆధార్ అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది.



గడియార స్తంభం సెంటర్‌లో నివాళులర్పిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

విమాన ప్రమాద మృతులకు నివాళులు

అమలాపురం టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన దుర్ఘటనలో అసువులు బాసిన ప్రయాణికులకు, మెడికోలకు అమలాపురం వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నివాళులర్పించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో తొలుత కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మృతులకు నివాళులర్పిస్తూ మౌనం పాటించారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధి గోకరకొండ నాగేంద్ర, ఏరియా కోఆర్డినేటర్ తేతల సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి బూరగాయల శివరామకృష్ణ, కోశాధికారి నాయుడు, సభ్యులు కంచిపల్లి అబ్బులు, గోటేటి గంగాధర్, నూకల సత్యనారాయణ, నమ్మిన వీరబాబు, పుత్సా కృష్ణకామేశ్వర్, పేరి లక్ష్మీనారాయణ, కుడుపూడి త్రినాథ్, పెనుమాల చిట్టిబాబు, పట్నాల రమణ, వలవల శివరావు పాల్గొన్నారు.

పంట కాలువా.. మురుగు డ్రెయినా..

అటు జనం.. ఇటు అధికారుల నిర్లక్ష్యం.. సాగునీరు పారేదెలా?

కొత్తపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కనీస బాధ్యత లేకపోతే ఇలాగే ఉంటుంది. ఇటు జనం నిర్లక్ష్యం, అటు అధికారుల అలసత్వం వల్ల పంటకాలువ మురుగు కాలువగా మారింది. కొత్తపేట మండలం పలివెలలోని పంటకాలువ వ్యర్థాలతో నిండిపోయింది. దీంతో సాగునీరు తమ పంట పొలాలకు అందేది ఎలా అంటూ రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వేసవికాలంలో కాలువలు మూసివేతతో స్థానికులు ఈ కాలువను వ్యర్థాలతో నింపేశారు. ఇరిగేషన్‌శాఖ ఈ ఏడాది ఎటువంటి పూడికతీత పనులు చేపట్టకపోవడంతో పంటకాలువ అధ్వానంగా మారింది. ఈ కాలువను ఆనుకుని వందలాది ఎకరాల వరి పండిస్తున్నారు. సాగునీరు అందేందుకు ఈ కాలువ ఏకైక మార్గం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు కాలువలకు నీరు వదులుతున్నా ఇక్కడికి చేరే పరిస్థితి లేదు.



వ్యర్థాలతో ఉన్న పలివెల పంట కాలువ





అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

1318 వరి వంగడాన్ని ప్రోత్సహించాలి

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో స్వర్ణ వరి వంగడానికి బదులు వరి పంట నిటారుగా నిలబడి ఉండే 1318 వరి వంగడాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. రానున్న రుతు పవనాల నేపథ్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో ఖరీఫ్ ముందస్తు సన్నద్ధతపై వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యాన, ఉపాధి హామీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలన్నారు. సేంద్రీయ వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా మానవుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. నరేగా అనుసంధానంతో కాల్వగట్లను అభివృద్ధిచేసి కూరగాయల సాగును ప్రోత్సహించడం, పాడిపరిశ్రమ అభివృద్ధికి పశువుల యూనిట్లు, పశుగ్రాసం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మేలు జాతి పాడి పశువులను అందించేందుకు కార్పొరేషన్లు, బ్యాంకుల ద్వారా పశు సంవర్ధకశాఖ అధికారులు రాయితీలతో కూడిన రుణాలు ఇప్పించి పాడి పరిశ్రమ అభివృద్ధికి పాటు పడాలన్నారు. నరేగా అనుసంధానంతో కోకో పంట సాగును మూడేళ్లపాటు ఎకరాకు మెటీరియల్, వేతన కాంపోనెంట్‌ల కింద రూ.1.59 లక్షలు గ్రాంటుగా అందిస్తుందన్నారు. కొబ్బరితోటల్లో అంతరపంటగా కోకో సాగును కనీసం వెయ్యి ఎకరాల్లో నరేగా అనుసంధానంతో ప్రోత్సహించాలని ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. అంబాజీపేట ఉద్యాన విశ్వవిద్యాలయం కోకో సాగుకు ప్రోత్సహించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. పశుగ్రాస విత్తనాలను రాయితీపై అందించి పశుగ్రాసం, పశువుల కొట్టాల నిర్మాణానికి నరేగా ఆధ్వర్యంలో చర్యలు చేపట్టాలన్నారు. రైతుకు లాభదాయకంగా ఉండే 1318 వరి వంగడాన్ని ఖరీఫ్ సీజన్‌లో ప్రతీ మండలంలో కనీసం 50 శాతం సాగు విస్తీర్ణం చేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సహజ సేంద్రీయ వ్యవసాయ దిగుబడులను ప్రోత్సహించాలన్నారు. ఎంటీయూ నిక్రా-1443 నూతన వరి వంగడాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టేందుకు 2 కిలోల వరి విత్తనాల ప్యాకెట్లను రైతులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, ఉద్యాన అధికారి బీవీ రమణ, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, పశుసంవర్ధకశాఖ అధికారి వెంకట్రావు, ఎల్డీఎం కేశవవర్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ప్రతీ కుటుంబం నుంచి ఒకరు పారిశ్రామికవేత్తగా ఎదగాలి

జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశంలో కలెక్టర్

అమలాపురం, జూన్13 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047 దార్శనికతకు అనుగుణంగా ప్రతీ కుటుంబం నుంచి ఒకరు పారిశ్రామికవేత్తగా ఎదగాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేలా యువత, మహిళలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక మండలి 15వ సమావేశం నిర్వహించారు. 14వ సమావేశపు తీర్మానాలపై తీసుకున్న చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకువచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ప్రతిపాదనలకు అనుమతులు, రాయితీలను సింగిల్ విండో పద్ధతిలో 209 అనుమతులు ఇచ్చామని తెలిపారు. పీఎం విశ్వకర్మయోజన ద్వారా 4500 మందికి శిక్షణ ఇవ్వడంతోపాటు 687 యూనిట్లను బ్యాంకర్ల సహకారంతో గ్రౌండింగ్ చేశామన్నారు. కమిటీ ఆమోదంతో 21 క్లయిమ్‌లకు సంబంధించి 17 యూనిట్లకు రూ.1.78 కోట్లు జమ చేశామన్నారు. మనమిత్ర యాప్‌లో 13 సర్వీసులు ఉన్నాయని, ఈజీ ఆఫ్ డూయింగ్ బిజినెస్ యాప్‌ను జిల్లాలో 1038 మంది వినియోగించుకుంటున్నారన్నారు. సముద్రపునాచు పైలెట్ ప్రాజెక్టుకై నేషనల్ ఫిషరీస్ డెవలప్మెంట్ బోర్డు సహకారం కోరామన్నారు. జిల్లాలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకై ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులను కేటగిరీల వారీగా విభజించి నివేదిక సమర్పించాలన్నారు. ఏడాదికి 370 మెట్రిక్ టన్నుల కోకో ప్రోసెసింగ్‌చేసి యూనిట్ మిషనరీ ఏర్పాటుకు జిల్లాలో సొసైటీని రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఏర్పాటుచేసి నాబార్డు సహకారంతో నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంఎస్ఎంఈ పార్కుల మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించి పనులను ఏపీఐఐసీ ద్వారా చేపట్టడం జరుగుతుందన్నారు. చిన్నా, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం పెట్టుబడి రాయితీ, పావలా వడ్డీ విద్యుత్ సేల్‌ట్యాక్స్ తదితర రాయితీల కింద ఉత్పాదక సేవారంగాలను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వీకేపీ ప్రసాద్, ఏపీఐఐసీ జోనల్ అధికారి రమణారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సముద్రంలో చేపల వేటకు వేళాయె..

నేటి అర్ధరాత్రి బయల్దేరనున్న బోట్లు

వేటకు మత్స్యకారుల సిద్ధం

6

బరిలోకి దిగితే.. పతకాల పంటే


కర్రసాము చేస్తున్న రాయుడు జోత్న్స, జోష్నితసత్యశ్రీ

- కర్రసాములో సత్తా చాటుతున్న అక్కాచెల్లెలు
- రాష్ట్రస్థాయిలో ఐదు స్వర్ణ పతకాలు
- ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచిన జోత్న్స
- కత్తిసాములోను ప్రతిభ కబరుస్తున్న వైనం

ఆ అక్కాచెల్లెళ్లు కర్రసాములో ఆరితేరారు. కర్ర పట్టారంటే పతకం కొట్టాల్సిందే.. కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్నారు.. రాష్ట్రస్థాయి పోటీల్లో ఐదు స్వర్ణపతకాలు సాధించి ఔరా అనిపిస్తున్నారు. వీరిలో అక్క కత్తిసాములోను ప్రతిభ కనబరుస్తూ ఆకట్టుకుంటోంది.

అమలాపురం టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలో ప్రముఖ పంచాంగకర్త ఉపద్రష్టవారి ఇంట అక్కాచెల్లెలు జోత్న్స, జోష్నితసత్యశ్రీ కర్రసాములో శిక్షణ పొందారు. రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో అద్భుత ప్రతిభ చాటి ఐదు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకం సాధించడంతోపాటు అక్క జోత్న్స ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచింది. అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెందిన రాయుడు రమేష్‌బాబు-సౌజన్య దంపతులకు ముగ్గురు కుమార్తెలు. ఆధునిక సమాజంలో ఆత్మరక్షణ విద్య ఆవశ్యకతను ఆ తల్లిదండ్రులు గుర్తించారు. ఇద్దరు కుమార్తెలకు మూడేళ్లుగా కర్రసాము, కత్తిసాము విద్యల్లో శిక్షణ ఇప్పించారు. అమలాపురం పట్టణానికి చెందిన ఉపద్రష్ట నాగాదిత్యన్, విమలాదిత్యన్, విక్రమాదిత్యన్, విజయాదిత్యన్‌ల వద్ద 60మంది కర్రసాము శిక్షణ పొందుతుండగా వారిలో 15 మంది విద్యార్థినులు ఉన్నారు. వారితోపాటు శిక్షణ పొందిన రమేష్‌బాబు కుమార్తెలు జోత్న్స, జోష్నితసత్యశ్రీ ఇటీవల గుంటూరు జిల్లా పెదనందిపాడులో జరిగిన రాష్ట్రస్థాయి తొలి కర్రసాము టోర్నమెంట్-2025 పోటీల్లో అక్కాచెల్లెలు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించిన అక్కాచెల్లెలు జోత్న్స, జోష్నితసత్యశ్రీ

ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా..

రాష్ట్రస్థాయి కర్రసాము పోటీల్లో జోత్న్స నాలుగు స్వర్ణ పతకాలతోపాటు ఒక రజత పతకం సాధించింది. రాష్ట్రం నలుమూలలనుంచి వందలాది మంది ఈ పోటీల్లో పాల్గొన్నప్పటికీ అద్భుత ప్రతిభతో జోత్న్స ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచింది. ఇక సోదరి జోష్నితసత్యశ్రీ సబ్ జూనియర్ విభాగంలో స్వర్ణ పతకం సాధించింది. కర్రసాముతోపాటు కత్తిసాములోను అక్కాచెల్లెలు ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. జోత్న్స ప్రస్తుతం 7వ తరగతిలోకి రాగా సత్యశ్రీ 5వతరగతి చదవుతుంది. మంగళవారం ఉపద్రష్టవారి ఇంట జరిగిన కార్యక్రమంలో అక్కాచెల్లెలు ఇద్దరినీ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేలా శిక్షణ ఇస్తామని నాగాదిత్యన్ సోదరుడు ప్రకటించారు.

సముద్రంలో చేపల వేటకు వేళాయె...

నేటి అర్ధరాత్రి బయల్దేరనున్న బోట్లు ... వేటకు సిద్ధమవుతున్న మత్స్యకారులు



కాకినాడ సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రెండు నెలల విరామం తర్వాత సముద్రంలో చేపల వేటకు ఫిషింగ్ బోట్లు సిద్ధమవుతున్నాయి. మత్స్య సంపద వృద్ధి, పరిరక్షణ నిమిత్తం ఈ ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజుల పాటు సముద్ర జలాల్లో చేపల వేటపై నిషేధం విధించారు. ఇది శనివారం అర్ధరాత్రి ముగియనుంది. జీవో ఆర్టీ నెం.129 ప్రకారం సముద్ర జలాల్లో యాంత్రిక పడవలు, మర పడవలు (మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లు)తో ఏ రకమైన చేపల వేట సాగించకుండా కట్టుదిట్టం చేశారు. నిషేధ ఉత్తర్వులు ఉల్లంఘించి చేపల వేట సాగించే బోట్ల యజమానులు ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం 1994 సెక్షన్ (4) ప్రకారం శిక్షార్హులు కాగలరని విస్తృతంగా ప్రచారం చేపట్టారు. వేట సాగించే బోట్లను, వాటిలోని మత్స్య సందపను స్వాధీనం చేసుకుని జరిమానా విధిస్తామని, బోట్ల లైసెన్సులను రద్దు చేయడంతో పాటు డీజిల్ ఆయిల్ సబ్సిడీ, ఇతర సబ్సిడీలు నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. నిషేధ కాలాన్ని కచ్చితంగా అమలు చేసేందుకు మత్స్య శాఖ కోస్ట్‌గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్, రెవెన్యూ యంత్రాంగంతో గస్తీ పెట్టారు. కాకినాడ జిల్లాలో మెకనైజ్డ్ బోట్లు 395, మోటరైజ్డ్ బోట్లు 3,694 ఉన్నాయి. కాకినాడ, ఉప్పాడ, తాళ్లరేవు, తొండంగి తీర ప్రాంతం నుంచి మత్స్యకారులు బోట్లు ద్వారా సముద్ర జలాల్లో చేపల వేట సాగిస్తున్నారు. వీటిపై ఆధారపడి 25,419 మంది జీవనోపాధి పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం జిల్లాలో వేట నిషేధ పరిహారంగా ఒక్కొక్కరికీ రూ.20 వేలు చొప్పున 25,419 మందికి రూ.50.83 కోట్లు అందజేసింది. నిషేధం గడువు ముగియడంతో బోట్లు, వలలకు మరమ్మతులు చేయించుకుని డీజిల్, నిత్యావసర సరుకులు సమకూర్చుకుని మత్స్యకారులు వేటకు సన్నద్ధమవుతున్నారు.


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.4.31లక్షలు

ఆత్రేయపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,31,934 లభించినట్టు ఉపకమిషనర్, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి అమలాపురానికి చెందిన వరదా శరణ్‌కుమార్-సూర్యనాగవెంకట అమృత దంపతులు రూ.1,01,116 విరాళం సమర్పించారు. కరపకు చెందిన గొర్రెల్ల సాయి వెంకటవంశీ కుటుంబ సభ్యులు రూ.50,116 విరాళం సమర్పించారు. విజయవాడకు చెందిన పచ్చిపులుసు రామకృష్ణ-లీలాశ్రీ నిర్మలకుమారి దంపతులు రూ.51,116 విరాళాలను సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.


అన్నదాన భవన నిర్మాణానికి విరాళం అందించిన దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

భీమేశ్వరాలయంలో ప్రముఖుల పూజలు


సైబరాబాద్ ఏసీపీ పద్మజకు వేదాశీర్వచనం ఇస్తున్న పండితులు

సామర్లకోట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన కాకినాడ జిల్లా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయానికి శుక్రవారం సైబరాబాద్ ఏసీపీ పద్మజ, విజయవాడ రైల్వే ఏసీబీ జడ్జి ఆర్.వెంకటేశ్వరరావు దంపతులు విచ్చేశారు. వారు భీమేశ్వర స్వామిని, బాలాత్రిపురసుందరి అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో వేదాశీర్వచనం ఇచ్చి ప్రసాదాలు,స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అందజేశారు. నిత్యాన్న దాన పథకానికి సామర్లకోటకు చెందిన పస్తుల రత్నలీల-శ్రీసత్యసూర్యనారాయణ దంపతులు రూ.1,01,116 విరాళాన్ని చెక్కు రూపంలో ఈవో నీలకంఠానికి అందజేశారు. దాత దంపతులకు స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించి వేదాశీర్వచనం ఇచ్చారు. చిత్రపటాలను ఈవో బహూకరించారు.


ఏసీబీ జడ్జి దంపతులకు వేదాశీర్వచనం పండితులు

ఈటీసీ ప్రిన్సిపాల్‌గా ప్రసాదరావు బాధ్యతల స్వీకారం


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రసాదరావు

సామర్లకోట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్‌గా కరుటూరి నాగ వర ప్రసాదరావు శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో ఎంపీడీవోగా పనిచేశారు. 25 ఏళ్ల క్రితం వీడీవోగా అప్పటి వీడీవో శిక్షణ కేంద్రంలో తొలిసారిగా శిక్షణ పొందారు. తిరిగి అదే కేంద్రం ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రసాదరావును అధికారులు, సిబ్బంది అభినందించారు. ఆయనకు డ్వామా ప్రత్తిపాడు ఏపీడీ మోకా భానుప్రకాష్ పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిశారు.

సముద్ర తీరంలో జాతీయజెండాలతో యోగా


జాతీయజెండాలతో యోగా చేస్తున్న మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు

పిఠాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన మన ఊరు-మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శుక్రవారం వినూత్న రీతిలో యోగాంధ్ర నిర్వహించారు. సంస్థ సభ్యులు ఉప్పాడ సముద్ర తీరంలో జాతీయ జెండాలతో యోగాసనాలు వేశారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండేపూడి శంకరరావు, అల్లవరపు నగేష్, సభ్యులు కేవీఎస్ఎస్ ప్రసాద్, పెమ్మరాజు సత్యరామచంద్రరావు, రాయుడు శ్రీనుబాబు,నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కనుమరుగు





మానవ తప్పిదాలతో కొన్ని, ప్రకృతి కన్నెర్రతో మరికొన్ని భారీ వృక్షాలు కనుమరుగవుతున్నాయి. వందల సంవత్సరాలకు పైగా వయసుండే వృక్షాలు రాజమహేంద్రవరం నగరంలోని సెంట్రల్ జైలు పరిసర ప్రాంతాల్లోనే ఉంటాయి. జైలు ఆధునీకరణ, ప్రైవేటు హోటల్ నిర్మాణ సమయంలోను చాలా వృక్షాలను తొలగించారు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం సెంట్రల్ జైలు పార్కులో మరో వృక్షం నేలకూలింది. దాంతో సిబ్బంది ఆ వృక్షాన్ని ముక్కలుగా చేసి తరలించారు.

-ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం.

నెక్స్ట్ ఏంటి?



- ఇంటర్ తర్వాత ఏం చేయాలి?
- ఇంజినీరింగ్‌లో ఏ కోర్సు తీసుకోవాలి?
- విద్యార్థులు, తల్లిదండ్రుల మధ్య చర్చ

ఇంటర్ ఫలితాలొచ్చాయ్.. మంచి మార్కులతో పాసయ్యారు.. ఏపీఈఏపీసెట్ ర్యాంకులు కూడా వచ్చేశాయి. ఇంజనీరింగ్, డిగ్రీ.. వీటిలో నెక్స్ట్ ఏంటి? మీ గోల్ ఏంటి? ప్రస్తుతం చాలా ఇళ్లల్లో ఇదే చర్చ.. చాలామంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మధ్య కూడా ఇదే టాపిక్ నడుస్తోంది.. ఏ కోర్సు చేస్తే బాగుంటుందనే విషయంపైనే చర్చ. డిగ్రీ చేసేద్దామనుకునే వారు కొందరైతే.. ఇంజనీరింగ్ చేయాలని మరికొందరు ఆలోచిస్తున్నారు. దీనిపై ప్రత్యేక కథనం..

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఏపీఈఏపీ సెట్ పరీక్షలు ముగిశాయి. త్వరలోనే ఫలితాలు వెలువడనున్నాయి. అనంతరం కౌన్సెలింగ్ కూడా జరగనుంది. ఇంజినీరింగ్ కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతుంటారు. ఏ బ్రాంచి తీసుకోవాలి? ఏ కళాశాలైతే బాగుంటుందనే సందేహాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులను వేధిస్తుంటాయి. ఈ నేపథ్యంలో ఏకోర్సుకు ప్రాధాన్యమివ్వాలి? ఏ కోర్సు చేస్తే ఉద్యోగావకాశాలు లభిస్తాయి? నాలుగేళ్లు ఈ కోర్సును విజయవంతంగా పూర్తి చేయాలంటే ఏం చేయాలి? ఏ కోర్సుకు బాగా ఆదరణ ఉంది? అనే విషయాలపై ప్రస్తుతం చర్చ విద్యార్థులు, వారి కుటుంబసభ్యులు, స్నేహితుల మధ్య సాగుతోంది.

ఏం రంగం ఇష్టం..

ముందుగా విద్యార్థులు తమకు ఇష్టమైన రంగం ఏంటో తెలుసుకోవాలి. కంప్యూటర్ సైన్స్, మెకానికల్, ఈఈఈ, సివిల్, ఈఐ, ఐటీ వంటి కోర్సుల్లో ఏదైతే మనకు సరిపోతుంది?, ఎందులో అయితే మనం రాణించగలం అనే విషయమై స్పష్టత రావాలి. మన సామర్థ్యం ఏమిటో ఆలోచించుకుని దానికి తగ్గట్టుగా బ్రాంచిని ఎంపిక చేసుకోవాలి. లేకుంటే కోర్సు పూర్తి చేయలేక విద్యాసంవత్సరం వృథా అవుతుంది.

కళాశాల గురించి తెలుసుకోండి..

విద్యార్థులు తాము చేరబోయే కళాశాల గురించి పూర్తి సమాచారం తెలుసుకోవాలి. కళాశాలలో మౌలిక సదుపాయాలు, న్యాక్, అటానమస్, ఎన్‌బీఏ తదితర గుర్తింపులు ఉన్నాయో! లేదో! చూసుకోవాలి. అక్కడ చదువుతున్న సీనియర్ విద్యార్థుల ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి. కళాశాలలో విద్యాబోధన ఎలా ఉంటుంది? ఎక్స్‌పర్ట్ ఫ్యాకల్టీ ఉంటున్నారా? క్యాంపస్ ఇంటర్వ్యూలకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఏమైనా ఇస్తున్నారా? వంటి వివరాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి. కళాశాల వాతావరణం, క్రమశిక్షణ, నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చే కళాశాలలను పరిశీలించుకోవాలి.

కోర్ బ్రాంచీలపై దృష్టి పెట్టండి

ప్రస్తుతం విద్యార్థుల చూపంతా సీఎస్ఈ, ఐటీ, ఈసీలపైనే ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ప్రభావం, ఐటీ రంగంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు లేకపోవడంతో నూతన జాతీయ విద్యా విధానంలో వచ్చిన మార్పులతో కోర్ బ్రాంచీలపైనా దృష్టిసారించాలని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం కోర్ బ్రాంచీలైన మెకానికల్, ఈఈఈ సివిల్ విద్యార్థులు ఈ సబ్జెక్టును చదవుకోవచ్చు.

ఈఈఈ విద్యార్థులకు అవకాశాలు

ఇంజినీరింగ్‌లో ప్రధానంగా ఈఈఈ, మెకానికల్, సివిల్ బ్రాంచ్‌ల విద్యార్థులను కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఆయా సంస్థలు ఎంపిక చేసుకుంటున్నాయి. వీరు ఇటు సాఫ్ట్‌వేర్ రంగంతోపాటు తమ కోర్ సంస్థల్లో కూడా ఎంపిక కావచ్చు. ఈ బ్రాంచ్ విద్యార్థులకు కాగ్నిజెంట్, టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, క్యాప్‌జెమినీ, హ్యుందయ్ మోటార్స్, అశోక్ లేలాండ్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్, కేసీపీ లిమిటెడ్, రామ్‌గ్రూప్, వీఈఈ టెక్నాలజీస్, జాస్పర్ ఇండస్ట్రీస్ వంటి ప్రముఖ సంస్థలు ఉద్యోగాలు ఆఫర్ చేస్తున్నాయి. గ్రీన్ ఎనర్జీ, సోలార్ ఎనర్జీ ప్రాముఖ్యం ఉన్న నేపథ్యంలో ఈఈఈ విద్యార్థులకు అవకాశాలు అధికం. బీటెక్‌లో ఏం బ్రాంచ్ చదివినా ఎంటెక్‌లో కంప్యూటర్స్ సంబంధిత కోర్సు చేయొచ్చు.



ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న

బీఎస్ఎఫ్ ఆర్ఎస్ఐ దేవానందంకు సత్కారం


దేవానందంను సత్కరిస్తున్న కమాండెంట్ నాగేంద్రరావు

కాకినాడ రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో బీఎస్ఎఫ్ ఆర్ఎస్ఐ ఆర్.దేవానందం పాల్గొన్నారు. శుక్రవారం ఆయన్ను కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్ ఎం.నాగేంద్రరావు సత్కరించారు. దేవానందం మాట్లాడుతూ బీఎస్ఎఫ్ 40 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్నానని, ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నందుకు చాలా సంతోషపడుతున్నానని అన్నారు. అదనపు కమాండెంట్ ఎస్.దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు మోహన్‌రావు, చంద్రశేఖర్‌రావు, ఆర్ఐ రాము, యూనిట్ వైద్యాధికారి శ్రీరామ్ పాల్గొన్నారు.



ఎండల్లో.. హాయ్ హాయ్



అమలాపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి యానాం నుంచి ద్రాక్షారామ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై దారి పొడవునా రోడ్డుకు ఇరువైపులా గతంలో నాటిన మొక్కలు చెట్లయ్యాయి. మండు వేసవిలో సైతం ఆ రహదారిపై పయనం ఎండల్లో హాయ్ హాయ్ అన్నట్టుగానే ఉంటుంది.

725.. నో సర్టిఫై!



▸ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 3970 స్కూల్ బస్సులు
▸ ఇంకా పూర్తికాని 725 బస్సుల ఫిట్‌నెస్
▸ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం
▸ ఫిట్‌లో రవాణా శాఖ పాత్ర సున్నా
▸ 'అన్నీ' ప్రైవేటు సంస్థే.. తీవ్ర ఆరోపణలు
▸ తెరుచుకున్న పాఠశాలలు
▸ ఆందోళనలో తల్లిదండ్రులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మీ పిల్లలు బడి బస్సులో వెళ్లి వస్తున్నారా? ఆ వాహనానికి ఫిట్‌నెస్ (ప్రయాణించే సామర్థ్యం) ఉందో లేదో చూసుకోండి మరి. ఎందుకంటే పాఠశాలలు తెరిచేసినా ఇంకా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొం దని బస్సులు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వందల్లో ఉన్నాయి. 2025-26 నూతన విద్యా సం వత్సరం ఈ నెల 12 నుంచి ప్రారంభమైంది. అ యితే ఇంకా ఉమ్మడి జిల్లాలో బడి బస్సుల సామ ర్థ్య పరీక్షలు అన్నిటికీ పూర్తి కాలేదు. ఫిట్‌నెస్ పూర్తయిన వాటిపైనా పలు అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. ప్రైవేటు పాఠశాలల్లో వేలాది మంది విద్యార్థులు బస్సుల్లోనే వెళ్లి వస్తుంటారు. విద్యార్థులను ఎక్కించుకునే బస్సులకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఉండాలి. ప్రతి ఏడాదీ ఈ సర్టిఫికెట్లు తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు రెండేళ్లకు పొడిగించారు. మార్చి వరకూ రోడ్డు రవాణా అధికారులు నిబంధనల ప్రకారం తనిఖీ చేసి ఆ ధ్రువపత్రాన్ని జారీ చేయడం జరిగేది. కానీ ఆ తంతును ప్రైవేటుకు అప్పగించడంతో ఫిట్‌నెస్‌పై ఆందోళన వ్యక్తమవుతోంది. కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో ఆటోమేటెడ్ టెస్టింగ్ సిస్టం ద్వారా ప్రైవేటు సంస్థ ఫిట్‌నెస్ ధ్రువీకరణ చేస్తోంది. కోనసీమ జిల్లాలో ఏటీఎస్ నిర్మాణంలో ఉండడంతో రవాణా అధికారులు వాహన సామర్థ్య పరీక్షలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇంకా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందని బస్సులు వందల్లో ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

● సర్టిఫికెట్ జారీ ఇలా..

రవాణా శాఖ ఆవిర్భావం నుంచి స్కూల్ బస్సులకు ఆ శాఖే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తోంది. వాహనాన్ని రవాణా అధికారులు భౌతికంగా నిబంధనల ప్రకారం తనిఖీ చేసి ఒక వేళ ఏవైనా మరమ్మతులు ఉంటే చేయించుకున్న త ర్వాత ధ్రువపత్రం జారీ చేసేవారు. చాలామంది అలసత్వం వహిస్తుండడంతో రవాణా శాఖ ఓ వెబ్‌సైటు రూపొందించింది. వెబ్‌సైటులో నేరుగా పాఠశాల యజమానులు బస్సుల వివరాలు, డ్రైవర్ల వివరాలను అప్‌లోడ్ చేసుకునేలా వెసులుబాటు కల్పించారు. వెబ్‌సైటులో స్కూల్ వివరాలను పూర్తిగా నమోదు చేయాలి. తర్వాత వచ్చే ధ్రువపత్రాన్ని ప్రింట్ తీసుకుని స్థానిక రవాణా అధికారి వద్దకు వాహనంతో వెళ్తే నిబంధనల ప్రకారం తనిఖీలు నిర్వహించి బ్రేక్ నిమిత్తం చలానా కట్టిస్తారు.

● వైసీపీ నిర్వాకం

కానీ వైసీపీ ప్రభుత్వం ఈ విషయంలో కూడా నిర్వాకాన్ని వెలగబెట్టింది. శి క్షణ పొందిన అధికారులను కాదని ఫిట్‌నెస్ జారీని పూర్తిగా ప్రైవేటు సంస్థలకు అప్పగించింది. దానినే ప్రస్తుత ప్రభుత్వం కూడా కొనసాగిస్తోంది. వాస్తవానికి కేంద్రప్రభుత్వం ఈ విధానానికి సంబంధించిన నిర్దేశాలను అన్ని రాష్ట్రాలకూ జారీ చేసింది. అయితే చుట్టుపక్కల రాష్ట్రాల్లో ఈ విధానం అమల్లో ఉన్నా నియంత్రణ మాత్రం రవాణా శాఖ చేతుల్లోనే ఉంచారు. మన దగ్గర మాత్రం పూర్తిగా ప్రైవేటుకే ధారాదత్తంచేయడంతో 'రేటు' పెట్టి మరీ పనులు కానిచ్చేస్తున్నారని చెబుతున్నారు. స్కూల్ బస్సుల సామర్థ్య ధ్రువీకరణలో కూడా రూ.4వేల నుంచి రూ.12వేల వరకూ అదనంగా వసూలు చేస్తూ బస్సు ఏటీఎస్‌కి వెళ్లక పోయినా, నెంబరు ప్లేట్లు మార్చి తీసుకొస్తున్నా పని కానిచ్చేస్తున్నారనే ఆరోపణలతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ పైసొమ్ము ఇవ్వకపోతే ఏదో సాకు చూపించి వేధిస్తున్నారని అంటున్నారు. ఇటీవల ఓ ఆటోవాలా ఫిట్‌నెస్‌కి వెళ్లగా పైసొమ్ము ఇవ్వలేదనే సాకుతో వేధించడంతో ఆవేదనతో తన ఆటో అద్దం తనే బద్దలు కొట్టుకొని నిరసన తెలిపాడు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి సర్దుబాటు చేయాల్సి వచ్చింది. అలాగే ఎఫ్‌సీ ఒక వాహనం పేరున ఉండి.. మరో వాహనం నెంబరుతో ఎఫ్‌సీ ఉండడం వంటి కూడా ఉంటున్నా యని చెబుతున్నారు. కొన్ని రాష్ట్రాలు ప్రైవేటు సంస్థ ఫిట్‌నెస్ చూసే ప్రదేశంలో రవాణా శాఖ నుంచి అనుభవం కలిగిన అధికారులను నియమించి జాగ్రత్తగా అమలు చేస్తున్నాయి. మన దగ్గర మాత్రం పూర్తిగా ప్రైవేటుకే దాసోహం అయిపోయారు. ఆర్టీవోకి కూడా లాగిన్ అధికారం లేకుండా పోయి ంది. విద్యార్థుల విషయంలో ఈ తంతు ప్రమా దానికి కోరలు ఇచ్చినట్లుగా ఉందనే వాదన వినవస్తోంది.

ఈ బస్సుల సంగతేంటి..!

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చూస్తే తూర్పు గోదావరిలో 1572 స్కూల్ బస్సులు ఉండగా 1300, కాకినాడ జిల్లాలో 1200కు 1050, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1203కు 900 బస్సులకు ఫిట్‌నెస్ పూర్తయింది. ఇంకా 725 బస్సులకు ఫిట్‌నెస్ పూర్తి కాలేదు. ఇవి రోడ్లపై తిరిగితే ప్రమాదాన్ని ఆహ్వానించినట్టే.

● అటువైపు చూడొద్దు

సదరు ప్రైవేటు సంస్థ వైపు కన్నెత్తి చూడొద్దని రవాణా అధికారులకు ఆదేశాలు ఉండడంతో అచేతనంగా ఉండాల్సి వస్తోంది. అసలు నిబంధనలు పాటిస్తున్నారా? అనే విషయంలో కూడా స్పష్టత ఉండడం లేదు. ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ ద్వా రా తనిఖీలు చేస్తున్నారని చెబుతున్నారు. అయితే ఆ యంత్రాల పనితీరుపై తనిఖీలు లేవు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే అధికారులు చూస్తున్నారని అంటున్నా.. దానిలో నిజంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చట్టప్రకారం సుమారు 50 రకాల నిబంధనలను ఫిట్‌నెస్ కోసం తనిఖీ చేయాల్సి ఉంటుంది. వాటిలో కొన్నిటిని భౌతికంగా పూర్తి చేయాలి. కానీ తూతూమంత్రంగా కానిచ్చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పైగా గతంలో కొవ్వూరు, రాజమండ్రిలో తనిఖీలు నిర్వహించే వారు. ప్రైవేటు కంపెనీ మాత్రం ఒకే చోట ప్రక్రియ పూర్తిచేస్తోంది. దీంతో వాహనదా రులు ఇబ్బంది పడుతున్నారు.

తల్లిదండ్రుల బాధ్యత ఏంటి?

పిల్లలను ఉదయం స్కూల్ బస్సు ఎక్కించడం, సాయంత్రం దించి ఇంటికి తీసుకెళ్లడం ఒకటే తల్లిదండ్రుల బాధ్యత అనుకుంటే పొరబాటే. పిల్లలు ప్రయాణించే బస్సు, డ్రైవరు, కండక్టరు పరిస్థితులు గమనిస్తూ ఉండాలి. బస్సు కండీషన్‌ని పరిశీలిస్తుండాలి. యాజమాన్యం నిబంధనలు పాటించకపోతే రవాణా, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. డ్రైవర్, అటెండర్ తీరును గమని స్తుండాలి. వాహనం నడిపే సమయంలో, పిల్లలను ఎక్కించేటప్పుడు, దించేటప్పుడు బాధ్యతగా ఉన్నాడా? సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్నారా? బస్సు లో పొగతాగడం, మద్యం తాగి డ్రైవింగ్ చేయడం వంటివి చేస్తున్నారా? ముఖ్యంగా విద్యార్థినులతో వారి ప్రవర్తన ఎలా ఉంది? అనేవి రోజూ గమ నిస్తుండాలి. బస్సు సిబ్బంది ప్రవర్తన ఇబ్బందిగా ఉన్నాసరే తల్లిదండ్రులకు భయపడి కొందరు పిల్లలు విషయాలను దాస్తుంటారు. అందువల్ల పిల్లలను ఆరా తీస్తూ ఉండాలి. చాలామంది డ బ్బులు త గ్గుతాయని, బస్సు సదుపాయం లేక పోవడం వంటి కారణాలతో ఆటోల్లో కుక్కినట్లు పంపిస్తుంటారు. దీని వల్ల పిల్లలు స్కూల్‌కి చేరుకునే సమయానికి అలసిపోతారు. పైగా ప్రమాదం కూడా.

బస్సు ఇలా ఉండాలి..

స్కూల్ బస్సులో పవర్ స్టీరింగ్‌తోపాటు ఫ్రీప్లే చాలా తక్కువగా ఉండాలి. డ్యాష్‌బోర్డు ప్యానెల్‌లో ఎడమ, కుడి సాంకేతాల ఇండికేటర్, ఎయిర్ ప్రెజర్ గేజ్, ఫెయిల్స్ సేఫ్టీ ఇండికేటర్, బ్రేకులలో లోపాలను తెలిపే ఇండికేటర్, ఫ్యూయల్ మీటర్, స్పీడో మీటర్ ఉండాలి. డ్రైవర్ సీటు వద్ద ఎయిర్ హ్యాండ్ బ్రేక్, హ్యాండ్ లివర్ గైడ్ స్ప్రింగ్, గేర్ లివర్‌లో అంతర్గత స్ప్రింగ్ ఉండాలి. క్లచ్ ప్లేట్, పెడల్ ఫ్రీప్లే ఒక అంగుళానికి తక్కువ ఉండకూడదు. వెనుక ఉన్న వాళ్ల కనిపించే అద్దం, బస్సులో కూర్చున్న విద్యార్థుల కదలికలు తెలుసుకోడానికి డ్రైవరు వద్ద అద్దం ఉండాలి. ఫుట్‌బోర్డు మొదటి మెట్టు భూమి నుంచి 325 మిల్లీమీటర్లకు మించి ఉండరాదు. ఫుట్‌బోర్డు మెట్ల వద్ద విద్యార్థులు ఎక్క డానికి, దిగడానికి వీలుగా రెయిలింగ్, సరిపడా లైటింగ్ ఉండాలి. సీట్ల కింద లగేజీ బాక్సులు, పార్కింగ్ లైట్లు, అత్యవసర ద్వారం, సురక్షితమైన విండ్ షీల్ (అద్దం), అత్యవసర సమయంలో జోర్ అద్దాలు పగుల గొట్టడానికి సుత్తి, అగ్నిమాపక యంత్రం (పౌడి), బస్సు తలుపులకు సురక్షిత లాకింగ్ సిస్టం, కాన్వెక్స్ క్రాస్ వ్యూ అద్దాలు ఉండాలి. సైడ్ విండోలకు మధ్యలో 31 అంగుళాలకు మించని దూరంలో అడ్డంగా 3 లోహపు కడ్డీలు అమర్చాలి. సీటింగ్ కెపాసిటీకి మించి అంటే విద్యార్థులు నిలబడి ప్రయాణించే విధంగా ఎక్కి ంచుకోవడం నిషేధం. బస్సుకు పసుపు రంగు వేయాలి. డ్రైవర్‌కి కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలి. అత్యవసర ద్వారాలు, సీటు ఆర్‌సీ బుక్ ప్రకారం ఉండాలి. సైడ్‌రాడ్‌లు కనీసం 2, 3 ఉండా లి. ఫస్ట్ ఎయిడ్ బాక్సులో అత్యవసర మందులు అందుబాటులో ఉండాలి. ఫైర్ సిలిండర్ వినియోగానికి సిద్ధంగా ఉండాలి. అటెండర్ వాటిని రోజూ పరిశీలించాలి. డ్రైవర్, ఎంవీఐ సెల్ నెంబర్లు కనిపించేలా ఉండాలి. విద్యార్థుల జాబితా బస్సులో ఉండాలి. లైటింగ్ సిస్టం మొత్తం బాగుండాలి.



ప్లాస్టిక్ కవర్లో పసికందు

అల్లూరి జిల్లా కొక్కిరిగూడెం అటవీ ప్రాంతంలో సంఘటన



ఆసుపత్రిలో పసికందు, వైద్యం చేస్తున్న సిబ్బంది



చింతూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఓ తల్లి పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆ మరుక్షణమే పసికందుని ప్లాస్టిక్ కవర్లో ఉంచి ఆ కవర్‌ని చెట్టుకు వేలాడదీసి మాయమైంది. అల్లూరి సీతారామరాజు జిల్లా వరరామచంద్రపురం మండలం కొక్కిరిగూడెం అటవీ ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం కొక్కిరిగూడెనికి చెందిన కొందరు అటవీ ప్రాంతానికి వేటకెళ్లారు. వారిలో మడివి రత్నరాజుకు ఓ చెట్టు వద్ద నుంచి పసికందు రోదన వినిపించింది. దీంతో చెట్టుకు వేలాడుతున్న ప్లాస్టిక్ కవర్‌తోపాటు అందులో ఉన్న పసికందుని చూసి నివ్వెరపోయాడు. వెంటనే ఇంటికెళ్లి తల్లి ముత్తమ్మకు విషయాన్ని చెప్పాడు. దీంతో ముత్తమ్మ చెట్టు వద్దకు వెళ్లి పసికందుని తీసుకుని ఇంటికెళ్లింది. విషయం తెలుసుకున్న కుందులూరు సబ్‌సెంటర్ ఏఎన్ఎం గుంపెనపల్లి చంద్రమ్మ బృందం హుటాహుటిన పసికందుని చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కోటిరెడ్డి నేతృత్వంలో చిన్నపిల్లల వైద్య నిపుణుడు మహేష్ ఆ పసికందుకు వైద్యం అందిస్తున్నారు. బిడ్డ పుట్టి దాదాపు 7,8 గంటలపాటు ఏడవడం, బొడ్డు కూడా కత్తిరించక పోవడంతో పరిస్థితి విషమంగా ఉందని, అయినప్పటికీ వైద్యం అందిస్తామని, పోలీసులకు సమాచారమిచ్చామని కోటిరెడ్డి తెలిపారు.

సముద్రంలో గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



మరణించిన పార్థు (ఫైల్)

కాకినాడ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ స్టోన్ బీచ్ వద్ద సముద్ర స్నానానికి దిగి గల్లంతైన యువకుడి దేహం లభ్యమైంది. వివరాల ప్రకారం.. గురువారం ఉదయం తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన దుర్గాప్రసాద్, జంగారెడ్డిగూడెం మండలం ఏపోలవరానికి చెందిన కేతా మోహన్, జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురానికి చెందిన సముద్రాల పార్థు(17) కలిసి కాకినాడ బీచ్ సందర్శనకు పల్సర్ ద్విచక్ర వాహనంపై స్టోన్‌బీచ్‌కు చేరుకున్నారు. మోహన్ ఫొటోలు తీస్తుండగా దుర్గాప్రసాద్, పార్థు స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. పార్థు అనుకోకుండా అలలధాటికి కొట్టుకుపోయి సముద్రంలో గల్లంతుకాగా ఎంత ప్రయత్నించినా రక్షించలేకపోయారు. పోలీసుల గాలింపు చర్యల్లో భాగంగా శుక్రవారం ఉదయం యువకుడి దేహం లభ్యమైనట్టు తిమ్మాపురం ఎస్‌ఐ గణేష్‌కుమార్ తెలిపారు. నారపురెడ్డి దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బీచ్ ఒడ్డున గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కాకినాడ రూరల్ పోలవరంలో గల జగన్నోహనపురం ఆర్చ్ ఎదురుగాగల బీచ్ ఒడ్డున గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు తిమ్మాపురం ఎస్‌ఐ గణేష్ కుమార్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 30 నుంచి 40 ఏళ్ల ఉంటుందని, ఎరుపురంగు కట్ బనియన్, నలుపురంగు డ్రాయర్ ఉన్నాయని, దానిపై అరుణ్‌గోల్డ్ ధూమ్ అనే అక్షరాలు ఉన్నాయని పేర్కొన్నారు. వివరాలు తెలిస్తే 9440796556 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

సత్యదేవుడి సన్నిధిలో గెయిల్ అధికారుల పూజలు



సత్యదేవుడి దర్శనానంతరం గెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ తదితరులు

అన్నవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం గెయిల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్‌కుమార్ గుప్తా, ఈడీ శాలిగ్రామ్ మావర్, జీఎం వై.ఏ కుమార్, షాకున్ గుప్తా తదితరులు స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానానికి వ్యర్థపునీటిని శుద్ధిచేసే సీవీపీ యంత్రం కావాలని కోరగా దానికి సంబంధించి లేఖను పంపిస్తే పరిశీలిస్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు,ఈఈ రామకృష్ణ ఉన్నారు.

ఘనంగా చండీహోమం

రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తశతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ముక్తేశ్వరాలయంలో చోరీ



ఆలయంలో క్లూస్‌టీమ్ పరిశీలన

అయినవిల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిలి మండలం ముక్తేశ్వరం శ్రీముక్తికాంత క్షణముక్తేశ్వరాలయంలో చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం ఆలయం మూసివేసిన సమయంలో ఆలయానికి వేసిన తాళాలు బద్దలుకొట్టి దొంగలు చోరీ చేశారు. పోలీసులకు ఫిర్యాదు అందడంతో క్లూస్‌టీమ్ కె.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేలిముద్రలు సేకరించారు. రూ. 1.40లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు అపహరించుకుపోయినట్టు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

రక్షించిన సీఐ



మహిళను రక్షించిన పోలీసులు

ఆలమూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ గౌతమి బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకోబోయిన మహిళను రావులపాలెం సీఐ సీహెచ్.విద్యాసాగర్ రక్షించారు. బిక్కవోలు మండలానికి చెందిన పలివెల శైలజ (30) తన భర్త రాజుతో ఉన్న కలహాల కారణంగా శుక్రవారం జొన్నాడ వద్దకు చేరుకుని గౌతమి బ్రిడ్జిపై నుంచి దూకే ప్రయత్నం చేస్తుండగా అటుగా వెళ్తున్న రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్ అడ్డుకున్నారు. ఆమెను ఆలమూరు పోలీసుస్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇప్పించి బంధువులకు అప్పగించారు.

2110 కిలోల బియ్యం స్వాధీనం



పోలీసులు సీజ్ చేసిన వ్యాన్

ఆలమూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ వద్ద వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని ఆలమూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వ్యాన్‌లో పీడీఎస్ బియ్యం తరలిస్తున్న వచ్చి న సమాచారంతో తనిఖీలు నిర్వహించి వ్యాన్‌ను గుర్తిం చారు. దీనిలో 42 బస్తాల (2110కిలోల) బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ అశోక్ తెలిపారు. వీటి విలువ రూ.97వేలుగా గుర్తించినట్టు చెప్పారు. ఆలమూరు ఎంఎస్‌వో ఎస్ జి. పద్మ ఫిర్యాదు మేరకు వ్యాన్‌ను సీజ్ చేసి కర్రి రామారెడ్డి, విజ్జన సుదర్శన్‌రావు, కాకిలేటి ప్రవీణ్‌కుమార్, నిశ్శనకోళ్ల జీవన్‌కుమార్‌లపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గడ్డిమందు తాగిన యువకుడి మృతి

కాకినాడ రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గడ్డిమందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం పండూరులో బుధవారం సాయంత్రం 7గంటల ప్రాంతంలో కోటికుల రాజేష్ (29) ఆర్థిక ఇబ్బందులతో ఒత్తిడిని తట్టుకోలేక గడ్డిమందును తాగాడు. రాజేష్ గతంలో తన సోదరుడితో కలిసి కౌలుకు వ్యవసాయం చేసేవాడు. భారీ అప్పుల కారణంగా తమ ఇంటిని తాకట్టు పెట్టడంతో 4 నెల ల క్రితం బ్యాంకు అధికారులు ఇంటిని స్వాధీనంచేసుకోవడంతో రాజేష్ మానసికంగా కుంగిపోయి గడ్డి మందు తాగాడు. కాకినాడ జీజీహెచ్‌లో చేర్చగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్టు తిమ్మాపురం ఎస్‌ఐ గణేష్‌కుమార్ తెలిపారు. తండ్రి అప్పలకొండ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

తొండంగి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం బుచ్చియ్యపేటకు చెందిన మడికి నాగ గోపి (39) మద్యానికి బానిసై బుధవారం గడ్డిమందు తాగాడు. అతడిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా శుక్రవారం మృతిచెందినట్టు తొండంగి ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్తుండగా..

ఆటోను లారీ ఢీకొని ఒకరి మృతి

● ఇద్దరికి తీవ్రగాయాలు

● కృష్ణంపాలెం హైవేపై ఘటన



మరణించిన దుర్గ (ఫైల్)

దేవరపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి ఆటోలో వెళ్తున్నవారికి వెనుక నుంచి లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం కృష్ణంపాలెం జాతీయ రహదారి వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమహేంద్రవరం సీతంపేటకు చెందిన చుక్కా బంగారయ్య, రమణమ్మ కుటుంబం విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి 11 మంది ఆటోలో బయలుదేరారు. ఈ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె అంజలీ దుర్గ (17) డిగ్రీ చదువుతోంది. రాజమహేంద్రవరం సీతంపేట నుంచి వారు బయలుదేరగా కృష్ణంపాలెం జాతీయ రహదారి పై ఆటోను వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అంజలీ దుర్గను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. ఇదే ఘటనలో ఆటో డ్రైవర్ ఎన్.నరేష్, నెల్లి వీరబాబుకు తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, అక్కడి నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.



108లో క్షతగాత్రులు తరలిస్తున్న దృశ్యం

తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య



మరణించిన సతీష్ (ఫైల్)

కొత్తపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించాడని మనస్తాపానికి గురైన కొడుకు ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందినట్టు ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు. వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన తులా రాంబాబు కుమారుడు సతీష్(31) పనులకు వెళ్లి డబ్బులు ఇంట్లోకి తేకుండా మద్యానికి బానిసయ్యాడని మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన సతీష్ స్నానం చేసేందుకు అని చెప్పి వాటర్ బకెట్, హీటర్ తీసుకుని వెళ్లి ఎంతసేపటికి బయటకు రాలేదు. రాంబాబు కంగారు పడి కిటికిలోంచి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో చుట్టుపక్కల వారి సాయంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయి న్నట్టు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో తండ్రి రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సురేంద్ర తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి



మృతిచెందిన పోసిబాబు



ఫైల్ ఫొటో

ఆత్రేయపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులు చేస్తుండగా విద్యుదాఘాతంతో వ్యవసాయ కూలీ మృతి చెందాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వేలిచేరుకు చెందిన తోట పోసిబాబు(32) శుక్రవారం సాయంత్రం వెలి చేరు-పులిదిండి సమీపంలో వ్యవసాయ పనులు చేస్తుండగా వ్యవసాయ మోటారు జీవైర్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురికావడంతో పోసిబాబు అక్కడిక్కడే మృతిచెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోసిబాబు మృతి వార్త తెలిసిన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రాము పేర్కొన్నారు.

రెండో రోజుకు ఎరెవ్నా 4.0 సదస్సు

జీజీహెచ్(కాకినాడ) జూన్ 12 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎరెవ్నా 4.0 సదస్సు రెండోరోజు శుక్రవారం కూడా కొనసాగింది. ప్రధానంగా జీజీహెచ్‌లో 15 వర్క్‌షాపులు నిర్వహించారు. హ్యాండ్స్ ఆన్ సర్జరీ, బేసిక్ ట్రామా కేర్, ఆడిట్ టూ యాక్షన్, విజియో నెక్స్, డయాగ్నోస్టిక్ స్కిల్స్, బర్తింగ్ బ్రిలియన్స్, రేడియేషన్ ఆంకాలజీ తదితర అంశాలపై వర్క్‌షాపులు, పేపర్ ప్రెజెంటేషన్‌లు నిర్వహించారు. అనంతరం సాయంత్రం మెడికల్ డిబేట్ నిర్వహించారు. ఉదయం సెషన్‌లో ట్రెజర్ హంట్ కార్యక్రమం ద్వారా వైద్య విజ్ఞానాన్ని పెంపొందించే యాక్టివిటీలు నిర్వహించారు. అలాగే సాయంత్రం రంగరాయ వైద్య కళాశాల ప్రాంగణంలో ఎరెవ్నా సదస్సుకు వివిధ వైద్య కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు సాంస్కృతిక ప్రదర్శనలు, పోటీలు నిర్వహించారు. శుక్రవారం మరో 50 మంది విద్యార్థులు రిజిష్టర్ అయ్యారు.

విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



కారు ఢీకొని తల్లీకొడుకులకు గాయాలు

అమలాపురం రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పేరూరు వై.జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం మోటారుసైకిల్‌పై ఇంటికి వస్తున్న తల్లీకొడుకులను వెనుక నుంచి కారు వేగంగా వచ్చి ఢీకొని వెళ్లిపోయింది. గాయపడ్డ వారిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పట్టణ సీఐ పి.వీరబాబు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వన్నెచింతలపూడి గ్రామానికి చెందిన కందేరి మరియమ్మ, రాజులు అల్లవరం మండలం గూడాలలో బంధువుల ఇంటికి వెళ్లారు. ఉదయం ఇంటికి తిరిగి వస్తుండగా పేరూరు వై.జంక్షన్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి కారు వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. గాయపడ్డ తల్లీకొడుకులను ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సీసీ కెమెరాలను పరిశీలించి అల్లవరం మండలం కోడూరుపాడుకు చెందిన వ్యక్తి కారుగా గుర్తించి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం..

చికిత్స పొందుతూ యువతి మృతి

భీమవరం క్రైం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మనస్తాపానికి గురైన యువతి ఆత్మహత్యం చేయగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు భీమవరం వన్‌టౌన్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు. వివరాలివి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చిర్రమానం గ్రామానికి చెందిన సంగాని రామలక్ష్మి తన ముగ్గురు పిల్లలతో భీమవరం తన తమ్ముడి ఇంటికి వచ్చింది. గతనెల 28న మొబైల్ ఫోన్ విషయంలో వాగ్వాదం జరగడంతో పెద్ద కుమార్తె అయిన సంగాని చందన ప్రియ(20)ను ఆమె తల్లి మందలించింది. మరుసటి రోజు 29న తెల్లవారుజామున రామలక్ష్మి తమ్ముడు ఇంటి బయట చూడగా ఆ యువతి షెడ్డులో ఇనుపరాడ్డుకు చీరతో ఉరివేసుకుని ఉండడం గమనించారు. వెంటనే కిందకు దించి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 12వ తేదీ సాయంత్రం యువతి మృతిచెందింది. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆర్డీవో తనిఖీ

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 13(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఆర్టీసీ కాంప్లెక్సును శుక్రవారం ఆర్డీవో దేవరకొండ అఖిల ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాంప్లెక్సులో షాపులు, క్యాంటీన్లో అమ్మే తినుబండారాలు, ధరలు పరిశీలించారు. మరుగుదొడ్లు, పారిశుధ్యం పరిశీలించారు. ప్రయాణీకులకు కల్పిస్తున్న సౌకర్యాలు పరిశీలించారు.

వెంకన్న ఆదాయం రూ.4.31లక్షలు

ఆత్రేయపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,31,934 లభించినట్టు ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.స్వామిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

విమాన ప్రమాద మృతులకు నివాళులు

ముమ్మిడివరం, జూన్13(ఆంధ్రజ్యోతి):అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన విమాన ప్రమాదంలో 241మంది మృతిచెందిన వారికి స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం అర్థాని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీడీపీ నాయకులు సంతాపం తెలిపారు. గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ మృతికి వారు సంతాపాన్ని వ్యక్తం చేశారు. రెండు నిమిషాలు మౌనం పాటించి మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో గొలకోటి దొరబాబు, దొమ్మేటి రమణకుమార్, దంగేటి శ్రీనివాస్, గుద్దటి వీరాస్వామినాయుడు, యాళ్ల ఉదయ్, విళ్ల వీరాస్వామినాయుడు, పాయసం చిన్నీ, బొక్కా రుక్మిణి, మెండి కమల, చింతలపూడి కొండాబు, నీతిపూడి వంశీ, దూనబోయిన రామ్‌కిరణ్, పొత్తూరి మల్లిబాబు, జనిపల్లి సత్యనారాయణ, గొలకోటి సురేష్ పాల్గొన్నారు. విమాన ప్రమాదంలో మరణించినవారి ఆత్మలకు శాంతి కలగాలని, బాధిత కుటుంబాలకు సంతాపం తెలుపుతూ ముమ్మిడివరంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కాశివానితూము సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు.


ముమ్మిడివరంలో సంతాపం వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మెల్యే బుచ్చిబాబు సంతాపం

ఐ.పోలవరం, జూన్13(ఆంధ్రజ్యోతి): విమాన ప్రమాద ఘటనపై ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వందలాది మంది మృతి చెందడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపారు. ఈప్రమాదంలో మెడికోలు ప్రాణాలు కోల్పోవడం జీర్ణించుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రగాఢ సానుభూతి

మామిడికుదురు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన విమాన ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటువంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రమాదంలో మరణించినవారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆయన ప్రార్థించారు.

తల్లికి వందనం.. పేదల కుటుంబాల్లో సంతోషం

అమలాపురం రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో కుటుంబంలో ఒకరికి మాత్రమే అమ్మఒడి వర్తింప చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మామీ మేరకు ఎంతమంది బిడ్డలు ఉన్నా తల్లికి వందనం వర్తింప చేస్తామని ప్రకటించారు. ఒక్కో బిడ్డకు రూ.13వేలు చొప్పున జమ చేస్తున్నారు. శుక్రవారం నుంచి తల్లికి వందనం పథకం సొమ్ములు తల్లుల ఖాతాలకు జమ అవుతుండడంతో తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు. ముందుగానే విద్యార్థుల తల్లి బ్యాంకు ఖాతాలకు ఆధార్, సెల్‌ఫోన్ నంబరు అనుసంధానం చేసుకుని ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ప్రకటించింది. అయితే కొందరు చేయించుకోకపోవడంతో సాంకేతిక కారణాలతో తల్లికి వందనం సొమ్ములు వారికి జమ కావడం లేదు. ఇద్దరు ఉన్నా, ముగ్గురు ఉన్నా, నలుగురు బిడ్డలు ఉన్నా ఈపథకం వర్తిస్తుంది. ఇంకా సాంకేతిక సమస్యలు విద్యాశాఖ అధికారులను వేధిస్తున్నాయి.

ముచ్చటగా ముగ్గురికి తల్లికి వందనం : తల్లి గుత్తుల నిర్మలతో ముగ్గురు బిడ్డలు



బండారులంక గ్రామానికి చెందిన గుత్తుల డీయార్‌శ్రీనివాస్-నిర్మల దంపతులకు ముగ్గురు సంతానం. హిమలక్ష్మిశ్రీ 8వ తరగతి, యజ్ఞ సత్యశ్రీ 6వ తరగతి స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. దుర్గారమాశ్రీ మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతుంది. ఇప్పటికే ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో ఈ ముగ్గురికి తల్లికి వందనం వర్తింప చేశారు. ఇప్పటికి ఒక పాపకు రూ.13వేలు పడింది.

ఆనందంగా ఉంది గోళ్ల శరత్‌నాగసాయిగణేష్, మోక్షిత



తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఓ బిడ్డకు రూ.13వేలు ఇప్పుడే బ్యాంకు ఖాతాకు జమ అయిందని తల్లి గోళ్ల శ్యామలభువనేశ్వరి తెలిపారు. ప్రసాద్-భువనేశ్వరి దంపతులకు శరత్ నాగసాయిగణేష్ (6వ తరగతి), మోక్షిత (3వ తరగతి) ఉన్నారు. అయితే ఎవరి పేరున ముందుగా బ్యాంకు ఖాతాకు నగదు జమ అయిందో తెలియదు. కానీ మంజూరైన జాబితాలో ఇద్దరు పిల్లల పేర్లు ఉన్నాయి. పిల్లలిద్దరికీ తల్లికి వందనం పథకం వర్తింప చేయడం ఎంతో ఆనందంగా ఉంది.

ఆధార్ లింక్ చేయించుకోక : వల్లెపు గణేష్, నాగేంద్ర సోదరులు



అమలాపురం ఉపర్లకాలనీకి చెందిన వల్లెపు శ్రీను-లక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం. వీరు అమలాపురంలోని ఎస్ఆర్ఎం బ్లూకాన్వెంట్‌లో చదువుకుంటున్నారు. పెద్ద కుమార్తె విజయ పదో తరగతి ఉత్తీర్ణత సాధించింది. గణేష్ పదో తరగతిలోకి రాగా నాగేంద్ర 7వ తరగతిలోకి వచ్చాడు. అయితే బ్యాంకు ఖాతాకు ఆధార్ లింకు, ఈకేవైసీ వంటి పనులు చేయించకపోవడంతో ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో వారి పేర్లు రాలేదు. వెంటనే స్పందించిన విద్యాశాఖ అధికారులు ఆధార్‌ను అనుసంధానం చేసే కార్యక్రమం చేపట్టారు. ఆ ముగ్గురికి తల్లికి వందనం వర్తిస్తుందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వం అన్నమాట నిలబెట్టుకుంది : శీలం నాగలక్ష్మి, అనాతవరం

ముమ్మిడివరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నాకు ముగ్గురు పిల్లలు. వారిని ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో కుటుంబంలో ఒక్కరికి మాత్రమే అమ్మఒడి పడేది. కూటమి ప్రభుత్వం ముగ్గురు పిల్లలకు రూ.13వేలు వంతున మంజూరు చేసింది. మాపిల్లలు 3,5,6 తరగతి చదువుతున్నారు. మాకు కూలీ పనే ఆధారం. పిల్లల్ని చదివించడం కష్టంగా ఉండేది. కూటమి ప్రభుత్వం ఒక్కొక్కరికీ రూ.13వేలుమంజూరు చేయడంతో ఏవిధమైన ఇబ్బంది ఉండదు. భవిష్యత్తులో వారి చదవు ముందుకు సాగేందుకు ఉపయోగంగా ఉంటుంది. ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలు చేయడం, మావంటి నిరుపేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.



నా భర్త నిరుద్యోగి.. నాకు అనారోగ్యం: జీర సత్యకుమారి కొత్తలంక



మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అబ్బాయి పదో తరగతి, అమ్మాయి 8వ తరగతి చదువుతున్నారు. అబ్బాయిని ప్రభుత్వ, అమ్మాయిని ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో ఒక్కొక్కరికి మాత్రమే అమ్మఒడి పడేది. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం ద్వారా ఇద్దరు పిల్లలకు రూ.13వేలు వంతున మంజూరు చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈసొమ్ములు లేకపోతే పిల్లలను చదివించడం ఎంతో కష్టపడాల్సి వచ్చేది. పేదర్గాల వారి పిల్లల చదువులకు తల్లికి వందనం పథకం ఎంతో మేలు చేకూరుతుంది.

కృతజ్ఞతలు - ఓదూరి రాణి, మోరి, మలికిపురం



మలికిపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంలో మా ముగ్గురి పిల్లలకు నగదు జమ అవడం పట్ల ఆనందంగా ఉంది. మను 4వ తరగతి, కవలలు దీక్షిన్‌కుమార్, దీక్షానాగశ్రీ 2వ తరగతి రివర్ సైడ్ పాఠశాలలో చదువుతున్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లపై నాకు నమ్మకం ఉంది. మాట తప్పని నాయకులకు కృతజ్ఞతలు.

ఆలయాలు సందర్శించిన డిప్యూటీ కమిషనర్


డిప్యూటీ కమిషనర్‌కు బాలబాలాజీ స్వామివారి చిత్రపటం అందిస్తున్న సహాయకమిషనర్

ఐ.పోలవరం/మామిడికుదురు/అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ డీఎల్వీ రమేష్‌బాబు శుక్రవారం మురమళ్ల శ్రీభద్రకాళీవీరేశ్వరస్వామిని, అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని, అప్పనపల్లి బాలబాలాజీ స్వామిని దర్శించుకున్నారు. ఆయా ఆలయాల్లో ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు. మురమళ్లలో ఆలయ అర్చకుడు పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో ఆయనకు ప్రత్యేక దర్శనం కల్పించారు. ఐ.పోలవరం కార్యక్రమంలో దేవదాయశాఖ తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు, ఆలయ పర్యవేక్షణాధికారి కటారి శ్రీనివాసరాజు పాల్గొన్నారు. అంతర్వేదిలో నూతన ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్ స్వామివారి చిత్రపటం, ప్రసాదం కమిషనర్‌కు అందజేశారు. మామిడికుదురులో స్వామివారి చిత్రపటాన్ని ఆలయ సహాయ కమిషనర్ సత్యనారాయణ అందించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకుడు బొక్కా సత్యంమూర్తి, అర్చకులు గొడవర్తి శ్రీనివాస్, వేదపండితులు జోష్యుల సోమయాజులు పాల్గొన్నారు.

జూలై 5న జాతీయ లోక్‌అదాలత్

అమలాపురం టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జూలై 5న మండల లీగల్‌సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్టు అమలాపురం రెండో అదనపు జిల్లా జడ్జి పి.గోవర్ధన్ తెలిపారు. వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, బ్యాంకు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను పరిష్కరిస్తామన్నారు. కక్షిదారులు అధిక సంఖ్యలో పాల్గొని జూలై 5వ తేదీ ఉదయం 10.30గంటలకు ప్రారంభమయ్యే నేషనల్ కోల్ అదాలత్‌లో తమ కేసులను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

డీఎల్డీవోగా వేణుగోపాల్


కలెక్టర్ మహేష్‌కుమార్‌ను కలిసిన వేణుగోపాల్

అమలాపురం టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అమలాపురం డివిజన్ స్థాయి అభివృద్ధి అధికారి జె.వేణుగోపాల్ శుక్రవారం డీఎల్డీవోగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. విధి నిర్వహణలో అంకిత భావం, జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడం ద్వారా డివిజన్ అభివృద్ధిలో కీలక భూమిక పోషించాలని వేణుగోపాల్‌కు కలెక్టర్ సూచించారు.

అంగన్‌వాడీల సేవలను వినియోగించుకోవాలి

పి.గన్నవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ కేంద్రాలు ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకుని ఆరోగ్యంగా ఉండాలని సీడీపీవో వై.విజయశ్రీ అన్నారు. స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం గ్రామ పంచాయతీ పరిధిలోని 23మంది చిన్నారులతో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి అక్షరాభ్యాసం చేయించారు. అలాగే గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి అంగన్వాడీ పిలుస్తోంది రావాలంటూ నినాదాలు చేశారు. గ్రామ సర్పంచ్ బొండాడ నాగమణి, ఎంపీటీసీ పులపర్తి చినవెంకటలక్ష్మి, సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



అధికంగా పార్కింగ్ చార్జీలు వసూలుచేస్తే చర్యలు


అమలాపురం ఆర్టీసీ డిపో సైకిల్ స్టాండ్‌లో ఏర్పాటుచేసిన ధరలపట్టిక

ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన

అమలాపురం రూరల్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ బస్టాండులోని సైకిల్ స్టాండులో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులపై శుక్రవారం 'బస్టాండులో సైకిల్ స్టాండ్ పేరిట దోపిడీ' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ అధికారులు స్పందించారు. సైకిల్ స్టాండ్‌ను తనిఖీచేసి లైసెన్సుదారుని ప్రశ్నించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని హెచ్చరిస్తూ జరిమానా విధించారు. సైకిల్ స్టాండ్ ప్రాంగణంలో వాహనాల పార్కింగ్ నిమిత్తం వసూలుచేసే ధరల పట్టికను అందరికీ కనిపించేలా ఏర్పాట్లు చేశారు. అధిక చార్జీలు వసూలుచేస్తే స్టేషన్ మేనేజర్‌కు ఫిర్యాదు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు.

ఆకట్టుకున్న కుట్టుమిషన్



పి.గన్నవరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో కుట్టుమిషన్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గచ్చుపై ట్రైనింగ్ టీచర్ జి.తరంగణితో పాటు పలువురు మహిళలు కుట్టుమిషను, కొలత బద్ద, కత్తెర మార్కర్లతో అందంగా తీర్చిద్దారు.

పెరుగుతున్న తాగునీటి కష్టాలు


మునిపల్లిలో కుళాయి వద్ద నీరు పట్టుకుంటున్న మహిళలు

ఉప్పలగుప్తం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వేసవిలో మామూలు రోజుల్లో కన్నా తాగునీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. తాగునీటి సరఫరా మాత్రం దీనికి రివర్స్ గేర్‌లో ఉంది. వేసవి ప్రారంభం నుంచి క్రమంగా ఉష్ణోగ్రతలు పెరిగి జనం ఉష్ణతాపంతో అల్లాడుతున్నారు. ఈసమయంలో తాగునీటి సరఫరా మాత్రం రోజురోజుకూ తగ్గిపోవడం గమనార్హం. రోజు విడిచి రోజు సరఫరా చేసే నీటి పరిమాణం క్రమంగా తగ్గిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం వెంపర్లాడుతున్నారు. ప్రధానంగా చల్లపల్లి ప్రాజెక్టు నుంచి గ్రామాలకు నీటి సరఫరాలో కోత పడుతోంది. విద్యుత్ సరఫరాకు అంతరాయం కల్గితే జనరేటర్ సిద్ధంగా ఉంచామని అధికారులు ప్రకటించినప్పటికీ వేసవి ప్రారంభం నుంచి నీటి సరఫరా తగ్గుతూ వస్తోందని జనం గగ్గోలు పెడుతున్నారు. చల్లపల్లి ప్రాజెక్టు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో నీటినిల్వలు చాలినంతగా ఉన్నప్పటికీ పంచాయతీ ట్యాంకులకు నిండుగా నీరు ఎందుకు సరఫరా జరగడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అయితే ఈసమస్యపై పంచాయతీ సర్పంచ్‌లు స్పందించకపోవడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల వైఫల్యం వల్లే తమకు తాగునీటి సమస్య తప్పడంలేదని మహిళలు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ ట్యాంకులకు పూర్తిస్థాయిలో నీరందంచి, గ్రామాల్లో తాగునీటి చౌర్యాలను అరికడితే సమస్య పరిష్కార మవుతుందని అంటున్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు క్రీడాకారుల ఎంపిక

అంబాజీపేట,జూన్13(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రిలో మూడు రోజులు జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో అంబాజీపేట శ్రీనివాస తైక్వాండో క్లబ్ క్రీడాకారులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తైక్వాండో కోనసీమ జిల్లా కార్యదర్శి పితాని త్రిమూర్తులు, కోచ్ పితాని భార్గవిశ్రీకళ తెలిపారు. ఈసందర్భంగా అంబాజీపేట జడ్పీ హైస్కూల్‌లో క్రీడాకారులను శుక్రవారం అభినందించారు. సబ్ జూనియర్స్‌లో జేస్సీలేఖన, లాహితితేజ, లక్ష్మి, క్యాడిట్ విభాగంలో ఎం.మౌనిక, జూనియర్ విభాగంలో పి.ఆదిత్యలు బంగారు పతాకాలను సాధించారన్నారు. ఎంఎల్‌డీ నూకేష్, ప్రసన్న, దేవకుమార్, ఎ.భార్గవ్, హేమరిత్విక్‌లు వెండి పతాకాలు, కుసువీరు, పూజిత దేవిలు బ్రాంజ్‌మెడల్స్ సాధించారు. ఈనెల 20న హరిద్వార్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ త్రిమూర్తులు తెలిపారు.క్రీడాకారులను ఎస్‌ఐ కె.చిరంజీవి, ఉపాధ్యాయులు, కోచ్‌లు అభినందించారు.

షైనింగ్ స్టార్స్ అవార్డు గ్రహీతలకు అభినందనలు

మామిడికుదురు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పదో తరగతి విద్యార్థులకు ప్రకటించిన ప్రతిభా అవార్డు(షైనింగ్ స్టార్స్)కు ఎంపికైన విద్యార్థులను ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు శుక్రవారం అభినందించారు. మొగలికుదురు శ్రీచైతన్య స్కూలుకు చెందిన ఏడుగురు విద్యార్థులు అవార్డులకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ సుధాలక్ష్మి తెలిపారు. ఈఅవార్డుల కింద మంజూరైన చెక్కులను శుక్రవారం ఎంఈవోలు విద్యార్థులకు అందించారు. ఏజీఎం పార్థసారథి, ఆర్ఐ రాజ్‌కుమార్, కోఆర్డినేటర్ శ్రీకాంత్, డీన్ రమేష్, సీ బ్యాచ్ ఇన్‌చార్జి శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.


చైర్మన్ పదవిని కేటాయించాలి

అమలాపురం టౌన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలోని దివ్యాంగుల్లో ఒకరికి కేటాయించాలని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దొడ్డిపట్ల శ్రీనివాస్ కోరారు. రాష్ట్ర దివ్యాంగుల మహాసంఘటన్ సమావేశం శుక్రవారం నిమ్మకాయల సురేష్ అధ్యక్షతన అమలాపురంలో జరిగింది. దివ్యాంగుల పెన్షన్‌ను రూ.3వేలు నుంచి రూ.6వేలకు పెంచడం పట్ల తొలుత సమావేశం కృతజ్ఞతలు తెలిపింది. దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు అంత్యోదయ పథకం కింద 35కిలోల బియ్యం అందించాలని కోరారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, 2016చట్టాన్ని అనుసరించి రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. చిక్కాల రవిశంకర్, మోటూరి వెంకటేశ్వరరావు, నిమ్మకాయల సురేష్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం పంపిణీ

అంబాజీపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వాకలగురువులో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వంకోల్పోయిన బాధిత కుటుంబాలను వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పరామర్శించారు. బాధితులకు నిత్యావసరాలు, నగదును అందించారు. పార్టీ మండల అధ్యక్షుడు విత్తనాల శేఖర్,ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, మద్దింశెట్టి మల్లిబాబు, మట్టపర్తి హరి, గోసంగి కుమారస్వామి, వాకపల్లి భాస్కరరావు, శ్రీనివాసరావు, కాండ్రేగుల దుర్గ పాల్గొన్నారు.

టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు మృతి



అంబాజీపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ కముజువారిలంక గ్రామశాఖ అధ్యక్షుడు వాసంశెట్టి పల్లంరాజు(41)విద్యుదాఘాతంతో శుక్రవారం మృతిచెందారు. పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషిచేశారని, ఆయన మృతి పార్టీకి తీరనిలోటని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. రాజుమృతదేహంపై టీడీపీ నియోజకవర్గ కోకన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ పార్టీ జెండాను ఉంచి నివాళులర్పించారు. పార్టీ మండల కార్యదర్శి గుడాల ఫణి, వాసంశెట్టి పల్లంశెట్టి, గుబ్బలనాగవెంకటరమణ తదితరులు నివాళులుర్పించిన వారిలో ఉన్నారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

పి.గన్నవరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తాగునీటి సరఫరాను శనివారం నిలిపివేస్తున్నట్టు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కల్యాణచక్రవర్తి తెలిపారు. తాగునీటి చెరువుల్లో సహజ సిద్ధంగా పెరిగిన చేపలను పట్టు కునేందుకు జిల్లా పరిషత్ వారు వేలం నిర్వహించారని ఆయన తెలిపారు. చేపలు పట్టుకునేందుకు శనివారం నాగుల్లంక, వాడ్రేవుపల్లి గ్రామాలు, మామిడికుదురు మండలం పెదపట్నం, మొగలికుదురు గ్రామాలకు నీటి సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఆదివారం యథావిధిగా తాగునీరు అందిస్తామన్నారు.

అన్నప్రసాద ట్రస్టుకు విరాళం

అయినవిల్లి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో అన్నప్రసాద ట్రస్టుకు పలువురు భక్తులు విరాళాలు అందజేశారు. సికింద్రాబాద్‌కు చెందిన పసుపులేటి సుజాత కుటుంబ సమేతంగా శుక్రవారం శ్రీవిఘ్నేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. దర్శనం అనంతరం రూ.1,01,116 విరాళాన్ని విఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు అందజేశారు. తణుకుకు చెందిన చెక్కా రామమోహనరావు కుటుంబ సభ్యులు శ్రీవఘ్నేశ్వరస్వామివారిని దర్శించుకుని అన్నప్రసాద ట్రస్టుకు రూ.10,116 అందజేశారు. రాజమహేంద్రవరంకు చెందిన ధర్మాల సూర్యనారాయణమూర్తి స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాద ట్రస్టుకు రూ.21వేలు అందజేశారు. దాతలను ఆలయ ప్రధాన అర్చకులు వేద ఆశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. ఈవో అల్లు భవానీ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందించి అభినందించారు.

అతిసార వ్యాధి నివారణకు ఇంటింటా సర్వే

అంతర్వేది, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ప్రోగ్రాంపై సఖినేటిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సఖినేటిపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బందికి శుక్రవారం శిక్షణ నిర్వహించారు. స్టాప్ డయేరియా అనే కార్యక్రమంతో అతిసార వ్యాధి నివారణ, అతిసార వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆశ కార్యకర్త, అంగన్‌వాడీ, ఏఎన్ఎంలు ఈనెల16నుంచి జూలై నెలాఖరు వరకు ఇంటింటా సర్వే నిర్వహిస్తారని వైద్యాధికారి పి.జయగాయత్రి తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సి.దుర్గాకావ్య, ఎస్‌వీవీ సత్యనారాయణ, పీఎల్ఎన్ స్వామి, ఎ.సరస్వతి, బాలశంకర్, కరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మామిడికుదురు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూలు ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు మామిడికుదురు హైస్కూలు హెచ్ఎం, కోఆర్డినేటర్ పి.చిరంజీవి తెలిపారు. పది, ఇంటర్ కోర్సులకు జూలై 31వరకు ప్రవేశాలు జరుగుతాయని, ఓపెన్ స్కూల్‌లో చేరే విద్యార్థులు కోఆర్డినేటర్ లేదా అసిస్టెంట్ కోఆర్డినేటర్‌ను మామిడికుదురు హైస్కూలులో సంప్రదించాలన్నారు. వివరాలకు 9494000669 నంబరులో సంప్రదించాలని కోరారు.

దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిల్ బహూకరణ

మలికిపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వృద్ధులు, నిరాశ్రయుల కోసం రాజమహేంద్రవరానికి చెందిన ఆస్క్ (అంబేద్కర్ సేవా కేంద్రం) చేస్తున్న సేవలు అభినందనీయమని ఓఎన్జీసీ జనరల్ మేనేజర్ పీజే ప్రసాద్ అన్నారు. శుక్రవారం అడవిపాలెం ఓఎన్జీసీ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో అడివిపాలేనికి చెందిన దివ్యాంగుడు అడబాల వీరవెంకటసత్యనారాయణకు మూడు చక్రాల సైకిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో బాబూరావు, సత్యనారాయణ, వెంకట్, ప్రసాద్ పాల్గొన్నారు.

22న అసిస్టెంట్ టైర్-2 రాత పరీక్ష

యానాం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ పోస్టులకు సంబంధించి టైర్-2 రాత పరీక్షను ఈనెల22న నిర్వహించనున్నట్టు పుదుచ్చేరి పరిపాలనా విభాగం అధికారులు ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే టైర్-1 పరీక్ష నిర్వహించి పలువురు అభ్యర్థులను ఎంపిక చేశారు. వారికి టైర్-2 రాత పరీక్ష నిర్వహించి ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అభ్యర్థులు ఆన్‌లైన్ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

నగరంలో తాగునీటి ఇక్కట్లు.. మహిళల ఆందోళన


నగరంలో తాగునీటి కోసం బిందెలతో ఎదురుచూస్తున్న మహిళలు

మామిడికుదురు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నగరం గ్రామం మొల్లేటివారి మెరక ప్రాంతంలో తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నామని శుక్రవారం రెండు వార్డులకు చెందిన మహిళలు బిందెలతో నిరసన చేపట్టారు. 25రోజులుగా తాగునీరు పూర్తిస్థాయిలో రావడంలేదని, అనేక ఇబ్బందులు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ వారు ట్యాంకర్ల ద్వారా నామమాత్రంగా తాగునీటిని పంపిణీచేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మొల్లేటి శ్రీనివాస్, కోళ్ల సురేష్‌బాబు, కొల్లాబత్తుల శారద, దోనిపాటి శేషాలక్ష్మి, మొల్లేటి బాల, బళ్ల సత్యనారాయణమ్మ, సానబోయిన శ్రీలక్ష్మి, సువర్ణకుమారి, అమీర్‌ఉన్నీసా, గెద్దాడ హేమసుందర్, మొల్లేటి భాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కార గ్రహీతలకు చెక్కుల పంపిణీ

ఉప్పలగుప్తం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి, ఎన్.కొత్తపల్లి ఉన్నత పాఠశాలలకు చెందిన ఆరుగురు విద్యార్థులకు ప్రభుత్వ ప్రతిభా పురస్కారాలు లభించాయి. కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్న విద్యార్థులకు శుక్రవారం ఒక్కొక్కరికి రూ.20వేల చెక్కులను అందించారు. గొల్లవిల్లి హైస్కూల్ విద్యార్థినులు అక్కల జ్యోషికశ్రీసూర్య, గనిశెట్టి శేషపద్మవైష్ణవి, కర్రి శ్రీమహా, ఓలేటి వీరలక్ష్మి, ఎన్.కొత్తపల్లి హైస్కూల్ విద్యార్థినులు అబ్బదాసుల సాయిసంకీర్తన, పేరూరి గౌతమిప్రియ చెక్కులు అందుకున్నారు. గొల్లవిల్లి హెచ్ఎం గోకరకొండ కనకదుర్గ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, సత్తి సత్యకృష్ణ, పీఎంసీ చైర్మన్ వోలా సత్యనారాయణ, ఎస్.నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు నగదు పురస్కారం

మలికిపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన కిడాంబి లతిక, కె.పావని, పెదపాటి హర్షిత, కోళ్ల హారిక, వి.లక్ష్మీవెంకటసత్యసాయిదీపక్లకు రూ.20వేలు చొప్పున మంజూరైన చెక్కులను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'తల్లికి వందనంలో కోత తగదు'

మలికిపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థినీ విద్యార్థులకు తల్లికి వందనం పేరుతో రూ.2వేలు మినహాయించి రూ.13వేలు మాత్రమే జమ చేయడం పట్ల పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు విమర్శించారు. మేనిఫెస్టోలో కుటుంబంలో ఎంత మంది ఉన్నా ఒక్కొక్కరికీ రూ.15వేలు తల్లుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని చెప్పి రూ.13వేలు జమ చేయడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వమే నిధులు మంజూరు చేయాలని, కోత విధించిన రూ.2వేలు తల్లుల ఖాతాలో జమ చేయాలని ఆయన కోరారు.

మాజీ మేయర్ కృష్ణయ్యకు నివాళి

యానాం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): యానాం సమాచారశాఖ ఆధ్వర్యంలో మాజీ మేయర్ సమతం కృష్ణయ్య వర్ధంతి నిర్వహించారు. స్థానిక ఫెర్రీ రోడ్డులోని ఆయన విగ్రహానికి పరిపాలనాధికారి మునిస్వామి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐ అడలరసన్, ఎస్ఐ శేరు నూకరాజు, సమాచారశాఖ అధికారి కేఎల్‌వీ ప్రసాద్, కృష్ణయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం తహశీల్దార్‌గా సుభాష్

ముమ్మిడివరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం తహశీల్దార్‌గా టి.సుభాష్ నియమితులయ్యారు. బదిలీల్లో భాగంగా ముమ్మిడివరం తహశీల్దార్‌గా పనిచేస్తోన్న ఎంవీ సుబ్బలక్ష్మి కాట్రేనికోన బదిలీఅయ్యారు. కోటనందూరు తహశీల్దార్‌గా పనిచేస్తోన్న టి.సుభాష్ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

ఘనంగా బూరుగులమ్మ తీర్థం

అంబాజీపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పుల్లేటికుర్రు గ్రామదేవత శ్రీబూరుగులమ్మఅమ్మవారి తీర్థం శుక్రవారం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవార్ని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం జాతరను వైభవంగా నిర్వహించారు. జాతరలో గరగనృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. గ్రామమంతా ఆడపడుచులతో కళకళలాడింది. ఎస్ఐ కె.చిరంజీవి ఆధ్వర్యంలో సిబ్బంది పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

పోస్టల్ ఉద్యోగి బాబి వితరణ

మండపేట, జూన్13(ఆంధ్రజ్యోతి): మండపేట పోస్టాఫీసులో అసిస్టెంట్ పోస్టుమాస్టర్‌గా పని చేస్తున్న కె.వి.నారాయణరావు(బాబి) కర్నూలు జిల్లా నంధ్యాలలో జరిగే గ్రామీణస్థాయి పోస్టల్ ఉద్యోగుల సదస్సు నిర్వహణకు సంబంధించి రూ.10వేలను అందజేశారు. ఈమేరకు సహచర ఉద్యోగులు బాబిని అభినందించారు.



వాడపల్లి వెంకన్న ఆలయంలో నాయీబ్రాహ్మణులకు పెరిగిన జీతాల చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నా

● ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీని దశల వారీగా అమలు చేస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శుక్రవారం వాడపల్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆలయంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. దేవాలయంలో విధులు నిర్వహిస్తున్న నా యీబ్రాహ్మణులకు ఎన్నికలలో ఇచ్చిన హామీ ని నెరవేర్చామన్నారు. రూ.20వేల కనీస వేత నాన్ని రూ.25వేలు పెంచి హామీలు నెరవేర్చిందన్నారు. ఆలయంలో విధులు నిర్వహిస్తున్న నాయీబ్రాహ్మణులకు పెంచిన వేతన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, ముదునూరి వెంకట్రాజు, ముళ్ళపూడి భాస్కరరావు, కాయల జగన్నాధం, కూసంపూడి రామకృష్ణంరాజు, పాల్గొన్నారు. ఆలయంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఎమ్మెల్యేకు వివరించారు.

సైఫాన్ పనుల పరిశీలన

లొల్ల వద్ద రూ.2.90కోట్ల వ్యయంతో శరవేగంగా చేపడుతున్న సైఫాన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శుక్రవారం పరిశీలించారు. నాణ్యతతో పనులు త్వరితగతిన పూర్తిచేసి సాగునీటికి ఇబ్బంది లేకు ండా చేయాలన్నారు. బొబ్బర్లంక నుంచి ఆర్‌అండ్‌బీ రహదారి లొల్ల వద్ద చేపడుతున్న సైఫాన్ పనుల కారణంగా రహదారిని తవ్వి పనులు చేపట్టారు. రహదారి నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలన్నారు. శనివారం వాడపల్లి ఆలయానికివెళ్లే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా రహదారి నిర్మాణపనులు చేపడుతున్నారు.

పంట కాలువలకు సాగునీరు విడుదల



చొప్పెల్ల వద్ద పంటకాలువలకు సాగునీరు విడుదల చేస్తున్న డీసీ అధ్యక్షుడు గోపాలస్వామి

ఆలమూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం చొప్పెల్ల మెయిన్‌కెనాల్ నుంచి పంట కాలువలకు సాగునీరును శుక్రవారం ఆలమూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ మెర్ల గోపాలస్వామి విడుదల చేశారు. ముందుగా కాలువవద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి చొప్పెల్ల నుంచి నర్సిపూడి, మోదుకూరు, గుమ్మిలేరు, మండపేట, గొల్లపుంత ప్రాంతాలలోని 3400ఎకరాలకు సాగునీరు అందించే ఈ కాలువకు సాగునీరు వదిలారు. ఈ ఏడాది ముందుగానే పంటకాలువలను బాగు చేయడం ద్వారా సాగునీటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకున్నామని రైతులు అవసరమైన మేర సాగునీరును ఉపయోగించుకుని నీటిని పొదుపు చేయాలని డీసీ అధ్యక్షుడు మెర్ల సూచించారు. కార్యక్రమంలో డీసీ ఉపాధ్యక్షుడు వైట్ల గంగరాజు, చొప్పెల్ల నీటి సంఘం ఉపాధ్యక్షుడు పా లచర్ల సత్యనారాయణ, నీటిపారుదలశాఖ ఆలమూరు ఏఈ కృష్ణత్రిమూర్తులు, చొప్పెల్ల లాకు సూపరింటెండెంట్ శేఖర్, సిబ్బంది శ్రీని వాస్, సురేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆలమూరులో ప్రత్యేక పూజలు

ఆలమూరు లాకులవద్ద సాగునీరు విడుదలకు చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాసరావు, నీటిపారుదలశాఖ ఏఈ కృష్ణత్రిమూర్తులు శుక్రవారం ప్రత్యేకపూజలు చేశారు. రైతులకు పంటకాలువల ద్వారా సాగునీటిని అందించేందుకు నీటిని విడుదల చేశారు. లాకు వద్ద నుంచి పంట కాలువల ద్వారా ప్రతీ ఎకరానికి సాగునీరు అందించే విధంగా చర్యలు చేపట్టినట్లు నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ తెలిపారు.



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న వాసంశెట్టి సత్యం

ఏపీఎస్ఎస్ జాబ్‌మేళాలో 45 మంది ఎంపిక

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 13 (ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీఎస్ఎస్ డీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 45 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. 685 ఖాళీలకు 13 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. 218 మంది జాబ్‌మేళాకు పేరు నమోదు చేసుకోగా 120 మంది హాజరైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు తెలిపారు. ఇంటర్వ్యూలలో 45మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్లేస్‌మెంటు అధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. సత్యంవాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం జాబ్ మేళాకు హాజరై నిరుద్యోగ సమస్యను అధిగమించేందుకు ప్రస్తుత ప్రభుత్వ విధానాలు ఉపకరిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వై.పద్మజ, డా.ఎన్.వి.రమణ, జాతీయోన్నత పాఠశాల హెచ్‌ఎం రాఘవ రెడ్డి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ.వీరన్న, కళాశాల ప్లేస్‌మెంటు అధికారి ఎం. షాహజాదీ బేగం, స్కిల్‌హబ్ కో ఆర్డినేటర్ ఆర్.రఘువర్మ, జిల్లా ఉపాధి అధికారిని ఐ.వసంతకుమారి పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి ప్రత్యేక చర్యలు : ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేట పట్టణంలోని రూ.3.10 కోట్ల వ్యయంతో చేపట్టే సీసీ రోడ్లు, డ్రైన్లకు సంబంధించిన పనులకు భూమి పూజ చేశారు. ఈకార్యక్రమంలో చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కమిషనర్ టీవీ రంగారావు, డీ.ఇ.ఇ శ్రీనివాస్, కౌన్సిలర్లు యారమాటి గంగరాజు, కాశీన కాశీ, చిట్టూరి సతీష్, మందపల్లి రవికుమార్, కొవ్వాడ బేబి, నీలం దుర్గ, మలసాని సీతా మహలక్ష్మి, పవన్, తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యేవేగుళ్ల

ఏడాదిలో ఏం సాధించారని సంబరాలు

● ఎమ్మెల్సీతోట ఎద్దేవా?

మండపేట, జూన్13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమిప్రభుత్వం ఏర్పడి ఏడాదైందంటూ కూటమినేతలు సంబరాలు చేసుకోవటంపై వైసీపీనేత మండపేట నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు విషయంలో కూటమిప్రభుత్వం విఫలమైందన్నారు. మండపేటలో శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈసమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, రెడ్డి రాధాకృష్ణ, వేగుళ్ల నారయ్యబాబు, శెట్టి నాగేశ్వరరావు, మందపల్లి రవి, బాపిరాజు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలం ఆక్రమణపై ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల మధ్య మాటల యుద్ధం

● మున్సిపల్ కౌన్సిల్‌లో వాడివేడి చర్చ





మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల, చైర్‌పర్సన్ రాణి

మండపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శుక్రవారం హాట్‌హాట్‌గా జరిగింది. చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మధ్య వాడివేడిగా మాటల యుద్ధం సాగింది. పట్టణంలోని బూరుగుంట చెరువువద్ద వున్న వాటర్‌ట్యాంకు పాడవటంతో పైకప్పు శిథిలావస్థకు చేరింది. ఈ వాటర్‌ట్యాంకుకు మరమ్మతులు చేసేందుకు కౌన్సిల్ రూ.27 లక్షలను కేటాయించారు. అలాగే పట్టణంలో ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరాకు ఆమోదించారు. అజెం డాలో పొందుపరిచిన అంశాలను కౌన్సిల్ ఆమో దించింది. తొలుత గుజరాత్‌లో జరిగిన విమానప్రమాదమృతులకు కౌన్సిల్ నివాళులర్పించి సంతాపం తెలిపింది. జరిగిన సంఘటనపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేసింది. వాటర్‌వర్క్సులో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పట్టణంలోవున్న వాటర్‌వర్క్సులో మున్సిపల్‌స్థల ం 18సెంట్ల మేర ఆక్రమణకు గురైందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తను మూడు సమావేశాల నుంచి అంశంను సమావేశం దృష్టికి తీసుకువచ్చినా ఎటువంటి చర్యలు తీసుకున్నారంటూ కమిషనర్ రంగారావును నిలదీశారు. సర్వే ప్రకారం ఆక్రమణకు గురైన స్థలం మున్సిపాల్టీదని తెలిపినప్పటికీ ఎందుకు అధికారులు స్వాధీనం చేసుకోవటం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆక్రమణదారుడికి వత్తాసు పలుకుతున్నట్టు ఉందంటూ తోట ఆరోపించటంతో ఎమ్మెల్యే వేగుళ్ల కలుగజేసుకుని తనకు సంబంధంలేదని అంటూనే తోట చేసిన ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. వాటర్‌వర్క్సుకు సంబంధించి ఆక్రమణకు గురైన స్థలం అంశం న్యాయస్థానంలో ఉ న్నందున తీర్పువచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని కమిషనర్ రంగారావు తెలిపారు, మున్సిపల్ కార్యాలయంపై రూ.13లక్షలతో 20 కె.వి.సోలార్‌టాప్ ఏర్పాటుకు కౌన్సిల్ ఆమోదించింది. 13వ వార్డులో అసంపూర్తిగా మిగిలిన కమ్యూనిటీహాలు పూర్తి చేసేందుకు రూ.83.50లక్షలు కేటాయించటంను ప్రారంభించిన కమ్యూనిటీ హాలుకు ఎలా నిధుల కేటాయిస్తారంటూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రశ్నించారు. చివరకు కమ్యూనిటీహాలు నిధులు మంజూరుకు ఆమోదం తెలిపింది. ఈసమావేశంలో వైస్ చైరన్‌లు వేగుళ్లనారయ్య, పిల్లి గణేశ్వరరావు, కౌన్సిలర్‌లు యారమాటి గంగరాజు, కాశీన కాశీవిశ్వనాథం, చిట్టూరి సతీష్, కాళ్లకూరి స్వరాజ్యభవాని, చింతలపూడి దుర్గ, మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు, డీఈఈ శ్రీనివాసరావు, అధికారులు కౌన్సిలర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక రహిత ప్రాంతాలుగా మార్చాలి

● అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కాశి శివనాగమల్లేశ్వరరావు



అంగరలో తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శివనాగమల్లేశ్వరరావు

కపిలేశ్వరపురం,జూన్ 13(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం, మండపేట, ఆలమూరు మండలాలను బాలకార్మిక రహిత ప్రాంతాలుగా మార్చేందుకు అందరూ సహకరించాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కాశి శివనాగమల్లేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని అంగర గ్రామంలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఆయన పర్యవేక్షణలో తనిఖీ బృందం పర్యవేక్షించింది. ఈబృం దంలో విద్యాశాఖ, పోలీస్‌శాఖ, శ్రమ ఎన్జీవోకి చెందిన దుర్గారావు, ఐసీడీఎస్ నుంచి అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. గ్రామంలోని వివిధ దుకాణాలు, వ్యాపార సంస్థలు, వృత్తి నిర్వహణ కేంద్రా ల్లో బాలకార్మికుల విషయమై తనిఖీలు చే పట్టారు. బాలకార్మికుల చట్టం ప్రకారం 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టడం నేరమన్నారు. చట్ట నిబంధనలపై అవగాహన కల్పించారు. బాలకార్మిక నిషేధచట్టంలోని సెక్షన్ 3, 3ఎ ప్రకారం నేరాలు నమో దుచేసి కోర్టులో కేసులు దాఖలు చేయనున్నట్లు తెలిపారు. బాలకార్మిక నిర్మూలన కోసం ప్రతీ యజమాని చట్టానికి అనుగుణంగా నడుచుకోవాలన్నారు. నేటిబాలలే రేపటిపౌరులు అనే విషయాన్ని గుర్తుంచుకుని వారిని చదువుకునేలా ప్రోత్సహించాలని ఆయన కోరారు.

అక్రమాలకు, అన్యాయాలకు విజయోత్సవ ర్యాలీనా!

రావులపాలెం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరకాలంలో ప్ర జలపై జరిగిన అక్రమాలకు, అన్యాయాలకు మీరు విజ యోత్సవ ర్యాలీ జరుపుకున్నారా....అని వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ప్రశ్నించారు. రావులపాలెం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం జగన్ ఇచ్చిన అమ్మ ఒడి కానీ, చేయూత కానీ, కాపునేస్తం కానీ సీఎం చంద్రబాబు ఇస్తే మీరు ఏపండగైనా చేసుకోండి అన్నారు. 8వ వింతగా కొత్తపేట నియోజకవర్గంలో బండారు బ్రదర్స్ పెట్టిన ఇసుక కొండలకు పేరు వస్తుందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానంతోనే ప్రాణదానం

● ప్రపంచ రక్తదాన దినోత్సవంలో ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, జూన్13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదానదినోత్సవం మండపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకుమారి నేతృత్వంలో శుక్రవారం జరిగింది. ఈ శిబిరానికి స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ రాణిలు హాజరయ్యారు. ప్రమాదాలు జరిగే సమయంలో రక్తంపో యి అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని అలాంటివారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావటం హర్షణీయమన్నారు. ఆసుపత్రిలో శిబిరంను ఎమ్మెల్యే వేగుళ్ల ప్రారంభించారు. ఈకార్యక్రమంలో రక్తదానం చేసిన వారందరినీ వైద్యులు, నేతలు అభినందించారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆర్డీవో ఆకస్మిక తనిఖీ



కాంప్లెక్సులో ప్రయాణికురాలితో మాట్లాడుతున్న ఆర్డీవో అఖిల

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను శుక్రవారం ఆర్డీవో దేవరకొండ అఖిల ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాంప్లెక్సులో షాపులు, క్యాంటీన్‌లో అమ్మే తినుబండారాలు, ధరలు పరిశీలించారు. మరుగుదొడ్లు, పారిశుధ్యం పరిశీలించారు. టూ వీలర్ పార్కింగ్ ధరలు వసూలు, రశీదుపుస్తకాలు పరిశీలించారు. అదే విధంగా విచారణ కేంద్రం పనితీరు, ప్రయాణికులకు కల్పిస్తున్న సౌకర్యాలు పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదే శాల మేరకు తనిఖీ చేసినట్లు తెలిపారు.

యోగా ట్రైల్ రన్ విజయవంతం చేయాలి



ఆలమూరులో యోగాపై ప్రత్యేక శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజు

ఆలమూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న జరిగే యోగా ట్రైల్ రన్ కార్యక్రమం మండలంలోని ప్రతీ సచివాలయం వద్ద విజయవంతంగా నిర్వహించాలని ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు సూచించారు. ఆలమూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం యోగా ట్రైల్ రన్ కార్యక్రమంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. యోగాంధ్రలో ప్రతీఒక్కరూ పాల్గొనే విధంగా పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రైల్‌రన్‌లో అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ముఖ్యంగా ఈనెల 16న నియోజకవర్గ స్థాయిలో జరిగే యోగాంధ్రలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది విధిగా పాల్గొనాలని ఎంపీడీవో రాజు కోరారు. మండల పరిషత్ ఏవో మోహర్‌ప్రసాద్, ఏపీవో అరుణకుమారి, ఎంపీఎం ధనరాజు పాల్గొన్నారు.

'నా భర్త ఆచూకీ తెలపండి'

కొత్తపేట, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నా భర్త ఇంటి నుంచి తప్పిపోయి సంవత్సరం గడుస్తున్నా ఆచూకీ తెలియరాలేదని కొత్తపేటకు చెందిన సత్యవరపు రత్నకుమారి వేడుకుంటుంది. వివరాల ప్రకారం.. కొత్తపేటకు చెందిన 66 ఏళ్ల సత్యవరపు ముత్యం 2024 అక్టోబరు 10న బయటకు వెళ్లి తిరిగి వస్తానని చెప్పి నేటికీ రాలేదని దీంతో కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ తన భర్త జాడ తెలియలేదని, ఉన్నతాధికారులు చొరవచూపి తన భర్త ఆచూకీ తెలపాలని రత్నకుమారి విజ్ఞప్తి చేశారు.

మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత

ఆత్రేయపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలి జడ్పీ హైస్కూల్‌కు చెందిన 2007-08 పూర్వపు విద్యార్థులు 10వ తరగతి మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేశారు. 10 పరీక్షలలో ఉత్తీర్ణత సాధించిన మెరిట్ విద్యార్థులకు ప్రథమ రూ.4500, ద్వితీయ రూ.3500, తృతీయ రూ.3వేలు నగదు ప్రోత్సాహకాలు అందించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ర్యాలి జడ్పీ హైస్కూల్‌లో నగదు ప్రోత్సాహకం అందిస్తున్న పూర్వపు విద్యార్థులు

పేకాట శిబిరంపై దాడి

● ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

రాయవరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడిలో పేకాట శిబిరంపై పోలీసులు దాడిచేసి ఐదుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం రాత్రి ఎస్ఐ మాట్లాడుతూ గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడిచేసి ఐదుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.22,800లు నగదు, పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పేకాట, జూదం, అసాంఘిక కార్యకలాపాలు వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్ఐ అన్నారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసాలు



రాయవరం అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న దృశ్యం.

రాయవరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామ ంలో అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ రాయవరం సెక్టార్ సూపర్‌వైజర్ పి.సునీత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుతగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేశారు. అనం తరం అంగన్‌వాడీ పిలుస్తోంది ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుడు లచ్చిరెడ్డి వెంకటరమణ మాట్లాడుతూ మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వా డీ కేంద్రాల్లో చేర్పించాలని, ఐదేళ్లు పూర్తయిన పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు పి.సురేఖ, ఎం.చంద్రకుమారి, ఎస్.కృష్ణకుమారి, వై.పద్మావతి, ఎం.నాగమణి, బి.ఎస్తేరు రాణి, పి.శైలజామణి పాల్గొన్నారు.

'పాఠశాలల్లో సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి'



లొల్ల పాఠశాలలో విద్యామిత్ర కిట్లు పంపిణీ చేస్తున్న డీవైఈవో తదితరులు

రాయవరం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని, రామచంద్రపురం డీవైఈవో ప్రత్తి రామలక్ష్మణమూర్తి, లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు అన్నారు. శుక్రవారం మండలంలోని లొల్ల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీవైఈవో, సర్పంచ్ తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉత్తమ బోధనతోపాటు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు విద్యామిత్ర పథకంలో భాగంగా పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్‌లు, షూ తదితర సామాగ్రిని డీవైఈవో, సర్పంచ్ తదితరులు పంపిణీ చేశారు. మాచవరం హైస్కూల్‌లో టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు మేడపాటి రవీంద్రారెడ్డి సర్పంచ్ సీతా మహాలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మెన్ పొడగట్లపల్లి వీరబ్రహ్మం తదితరులు చేతుమీదుగా విద్యామిత్ర కిట్‌లను పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో ఎంఈవో-2 వై.సూర్యనారాయణ, టీడీపీ నాయకుడు సుంకవిల్లి గంగరాజు, ఎస్ఎంసీ చైర్మెన్ లంక వెంకన్న, హెచ్‌ఎం జోసెఫ్, ఉపాధ్యాయులు రమణమూర్తి, చంద్రకళ, కృష్ణవేణి, రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల పంపిణీ

కపిలేశ్వరపురం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథ మిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు శుక్రవారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో కె.తాతారావు మాట్లాడుతూ మండలానికి 12,246 పాఠ్యపుస్తకాలు, 2,290 వర్క్ బుక్‌లు, 2,656 బ్యాగ్‌లు, 17,912 నోట్‌బుక్స్ 288 డిక్షనరీలు, 1,690 బెల్టులు అందాయని వీటిని పాఠశాలల్లోని విద్యార్థులకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

విద్యామిత్ర కిట్‌లు పంపిణీ

కె.గంగవరం, జూన్13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కె.గంగవరంలో ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో ఏ. నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం వారు అందించిన విద్యాసామగ్రిని ఉపయోగించుకుని ఉన్నత ఫలితాలు సాధించాలని అన్నారు. స్వయంగా విద్యాకిట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు, విద్యాకమిటీ చైర్మన్ శ్రీమన్నా రాయణ, డిప్యూటి తహశీల్దార్ శ్రీరామ్‌ప్రసాద్, జిల్లా సైన్స్ అధికారి గిరిజాల వి.ఎస్. సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు కూటమి నేతల సంతాపం

ఆత్రేయపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్‌ఇండియా విమాన ఘోర ప్రమాదంలో మృతులకు శుక్రవారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో కూటమి శ్రేణులు ఘన నివాళులర్పించారు. ఆత్రేయపురం మండలం వాడపల్లి ఫంక్షన్‌హాలులో ఎమ్మెల్యే బండారు ఆధ్వర్యంలో కూటమి శ్రేణు లు నివాళులర్పించి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతు ల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.



వాడపల్లి ఫంక్షన్ హాలులో విమాన ప్రమాద బాధితుల మృతికి సంతాపం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు